ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 35.0
కనిష్ఠం : 26.0

ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన కారు
సత్యనారాయణపురం వద్ద ప్రమాదం 7
ఒకే కుటుంబంలో ముగ్గురి మృతి



ఇండోర్ స్టేడియం నుంచి జాతీయ జెండాతో ర్యాలీగా వెళుతున్న కలెక్టర్ వెట్రిసెల్వి, జేసీ ధాత్రి రెడ్డి

జాతీయ జెండాతో భారీ ర్యాలీ

ఏలూరు సిటీ, ఆగస్టు 13: నగరంలో 125 అడుగుల జాతీయ జెండాతో 800 మంది విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఇండోర్ స్టేడియంలో క్రీడలు, పర్యాటక శాఖల సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో కలెక్టర్ కె.వెట్రిసెల్వి, జేసీ పి.ధాత్రిరెడ్డి హర్ ఘర్ తిరంగా ప్రతిజ్ఞ చేయించారు. ఇండోర్ స్టేడియం నుంచి ఫైర్‌స్టేషన్ వరకు ర్యాలీ సాగింది. నగరంలోని కస్తూరిబా బాలికోన్నత పాఠశాల, సెయింట్ థెరిస్సా కళాశాలల విద్యార్థినీ విద్యార్థులు, యువతీ యువకులు పాల్గొన్నారు.



జాతీయ జెండాతో ర్యాలీగా ఫైర్‌స్టేషన్ సెంటర్‌కు చేరిన విద్యార్థులు, ఎన్‌సీసీ కేడెట్స్



మాదకద్రవ్యాలపై అవగాహన ర్యాలీలో ఎస్పీ, కలెక్టర్, జేసీ

మాదకద్రవ్యాలు నియంత్రిద్దాం

ఏలూరు రూరల్, ఆగస్టు 13: సమాజ శ్రేయస్సుకు మాదకద్రవ్యాల నియంత్రణ ఎంతో ముఖ్యమని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అన్నారు. నాషా ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా మాదక ద్రవ్యాల నియంత్రణ, దుష్ప్రభావాలపై అవగాహన ర్యాలీని ఎస్పీ కె.ప్రతాప్‌శివకిశోర్, జేసి పి.ధాత్రిరెడ్డితో కలసి కలెక్టర్ మంగళవారం ప్రారంభించారు. యువత ఉజ్వల భవిష్యత్‌ను నాశనం చేసే మాదకద్రవ్యాల వినియోగాన్ని జిల్లాలో పూర్తిగా రూపుమాపేందుకు ప్రజలంతా భాగస్వాములు కావాలన్నారు. మాదకద్రవ్యాల నియంత్రణకు ఉద్యమంలా ప్రతిఒక్కరూ కదిలిరావాలన్నారు. జిల్లాలో గంజాయి, డ్రగ్స్, అక్రమ మద్యం, సారా అమ్మకాలు, రవాణాపై ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. ఎస్పీ జె.ప్రతాప శివకిశోర్ మాట్లాడుతూ పోలీస్‌శాఖ మాదక ద్రవ్యాల నియంత్రణకు పటిష్ఠ చర్యలు తీసుకుంటుందన్నారు. మాదకద్రవ్యాల సరఫరా, వినియోగించే వారి సమాచారాన్ని తెలియచేసే వారికి రివార్డులు ప్రకటిస్తామన్నారు. జిల్లాలో ఆకస్మిక తనిఖీలు చేసి, మాదకద్రవ్యాల వినియోగానికి తావులేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో పుష్పమణి, ఆర్డీవో ఖాజావలీ, డీసీహెచ్‌ఎస్ పాల్‌సతీష్, ట్రాన్స్‌కో ఎస్‌ఈ సాల్మన్‌రాజు, నగరపాలక సంస్థ ఎంహెచ్‌వో మాలతి, డిఈవో అబ్రహం, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన కలెక్టర్, ఎస్పీ

ఏలూరు సిటీ, ఆగస్టు 13: మిషన్ శక్తి బేటి పడావో కార్యక్రమం కింద నూరు రోజుల ప్రత్యేక అవగాహనా కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఐసీడీఎస్ కార్యాలయం వద్ద ఎస్పీ కె.ప్రతాప్ శివకిశోర్, జేసీ పి.ధాత్రిరెడ్డితో కలిసి కలెక్టర్ కె.వెట్రిసెల్వి మొక్కలను నాటారు. పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, విరివిగా మొక్కలు నాటాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. డీఆర్వో పుష్పమణి, ఆర్డీవో ఎస్‌కె.ఖాజావలి, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ ఏడి రాకాడమణి, ఏపీఈపీడీసీఎల్ ఎస్‌ఈ సాల్మన్‌రాజు, ఏపీఎంఐపి పిడి రవికుమార్, డీసీహెచ్‌ఎస్ పాల్‌సతీష్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీలకు సత్వర న్యాయం అందించాలి

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులలో సత్వర న్యాయం అందించడానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెట్రిసెల్వి అన్నారు. ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన మంగళవారం జరిగింది. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. సమావేశంలో ఎస్పీ కె.ప్రతాప్ శివకిశోర్, చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్, అధికారులు పాల్గొన్నారు.

ఇంటింటా ఓటర్ల సర్వే నిర్వహించాలి

సంక్షిప్త సవరణ ఓటర్ల జాబితా తయారీలో భాగంగా ఇంటింటా ఓటర్ల సర్వే నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్ ప్రధాన కార్యదర్శి వివేక్ యాదవ్ తెలిపారు. జిల్లా కలెక్టర్లు, ఈఆర్వోలతో మంగళవారం ఆయన అమరావతి నుంచి వీడియో సమావేశం నిర్వహించారు. సంక్షిప్త సవరణ ఓటర్ల జాబితా రూపొందించడానికి ఆగస్టు 20 నుంచి అక్టోబర్ 18 వరకు ఇంటింటా ఓటర్ల సర్వే ప్రక్రియ జరుగుతుందన్నారు. అక్టోబర్ 19 నుంచి 28 వరకు దరఖాస్తుల పరిశీలన జరుగుతుందన్నారు. అక్టోబర్ 29న సంక్షిప్త ముసాయిదా ఓటర్ల జాబితా రూపొందించాలన్నారు. సెప్టెంబర్ 29 నుంచి నవంబరు 28 వరకు అభ్యంతరాలను స్వీకరిస్తామన్నారు. డిసెంబర్ 24లోగా అభ్యంతరాల పరిశీలన, పరిష్కార కార్యక్రమం చేపట్టాలన్నారు. 2025 జనవరి 1లోగా నిబంధనల మేరకు జాబితా పరిశీలించాలన్నారు. 2025 జనవరి 6న సంక్షిప్త సవరణ ఓటర్ల జాబితా ప్రచురించాలని ఆయన తెలిపారు.

గిరిజన సమస్యలకు ఫోన్ నెంబర్


గిరిజన ప్రాంతాల్లో ఎదుర్కొంటున్న సమస్యలు తెలియజేయడానికి 9491041188 ఫోన్ నెంబర్‌ను ఏర్పాటు చేయడం జరిగిందని కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. గిరిజనం సమస్యలను ఈ ఫోన్ నెంబర్ ద్వారా తెలియజేసినా, మెసేజ్ చేసినా వెంటనే చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వెట్రిసెల్వి తెలిపారు.



16న అన్న క్యాంటీన్లు ప్రారంభం

ఏలూరు టూటౌన్, ఆగస్టు 13: పేదలు ఎదురు చూస్తున్న అన్న క్యాంటీన్లు రెండు రోజుల్లో ప్రారంభం కానున్నాయి. ఏలూరు నగరంలో నాలుగు చోట్ల ఈ నెల 16న అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేయడానికి అధికారులు ఏర్పాట్లు చేశారు. నగరంలోని స్టేట్ బ్యాంకు వద్ద, ఆర్ ఆర్.పేట వెంకటేశ్వరస్వామి గుడి వద్ద, తంగెళ్ళమూడి వంతెన వద్ద, రైస్‌మిల్లర్స్ వద్ద అన్న క్యాంటీన్లు ప్రారంభానికి ముస్తాబయ్యాయి. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఈ నెల 15న కూటమి ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా 100 అన్న క్యాంటీన్లు ప్రారంభించాలని నిర్ణయించింది. ఏలూరులో 4 క్యాంటీన్లు 16వ తేదీ ఉదయం అల్పాహారంతో ప్రారంభం కానున్నాయి. మధ్యాహ్నం, రాత్రి భోజనం అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు నగరపాలక సంస్థ ఎస్‌ఈ వెంకటేశ్వరరావు తెలిపారు.

ఇసుక కొరత



స్టాక్ పాయింట్లలో నిల్వలు ఖాళీ.. గోదావరి వరదలతో లభ్యం కాని ఇసుక

గత ఐదేళ్లలో ఇసుక కోసం జనం పడిన పాట్లు అన్నీఇన్నీ కావు. అప్పటి వైసీపీ ప్రభుత్వం ఇష్టారాజ్యం.. అదేస్థాయిలో ఇసుక కాంట్రాక్టర్లు చెలరేగిపోయారు. ఇల్లు కట్టుకోవడం కంటే ఇసుక పొందడమే అప్పుడు పెద్ద సమస్య. ప్రభుత్వం ధరలు ప్రకటించినా మచ్చుకైనా అమలు కాలేదు. అయినా నిబంధనలకు అనుగుణంగా ఇసుక సరఫరా చేస్తున్నట్టు అప్పటి ప్రభుత్వం చంకలు గుద్దుకుంది. దళారులు మాత్రం తెగ రెచ్చిపోయి ఇసుక దందా చేశారు. చీకటి మాటునే కాదు పట్టపగలు కూడా ఇసుక దోపిడీకి పాల్పడ్డారు. ఇలాంటి విధానాలతో ఐదేళ్లపాటు నిర్మాణ రంగం కుదేలైంది. కూటమి ప్రభుత్వం ఏర్పాటుతో ఇసుక కష్టాలు తీరుతాయని అందరూ గంపెడాశతో ఉన్నారు. కూటమి ప్రభుత్వం ఉచిత ఇసుక విధానం ప్రకటించి గత నెలలోనే అమలు చేసింది. స్టాక్ పాయింట్‌లో నిల్వలు కరిగిపోవడం, గోదావరి వరదలతో ప్రస్తుతం ఇసుక కొరత నెలకొంది.

- నెల రోజుల్లోనే తరిగిన ఇసుక నిల్వలు
- భారీ వర్షాలతో పొంగిపొర్లుతున్న నదులు, వాగులు
- జిల్లాలో రెండు స్టాక్ పాయింట్లలో ఒకటి సుదూరం
- రెండో స్టాక్‌లో నిర్మాణాలకు అనువుగాలేని ఇసుక
- నిర్మాణ రంగానికి తాత్కాలిక విరామం
- ప్రభుత్వం వెసులుబాటు ఇచ్చినా కార్మికులకు నిరాశ
- అక్టోబరు నుంచి ఇసుక లభించే అవకాశం

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

ఉచిత ఇసుక విధానం అమలు స్టాక్ పాయింట్ల ద్వారా సరఫరా చేశారు. మొదట కుక్కునూరు మండలం వింజరం, ఇబ్రహీంపేట, ఉంగుటూరు మండలం చేబ్రోలు వద్ద ఇసుక స్టాక్ పాయింట్లను గుర్తించారు. ఆయా స్టాక్ పాయింట్లలో దాదాపు రెండున్నర వేల టన్నులకుపైగా ఇసుక నిల్వ ఉన్నట్టు అప్పట్లో ప్రాథమికంగా గుర్తించారు. కేవలం రవాణా చార్జీలు ప్రజలు భరించాలని సూచించి ఆన్‌లైన్ విధానంలో ఇసుక సరఫరాకు శ్రీకారం చుట్టింది. ఇంత చేస్తే కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో అక్కడక్కడ ఉన్న ఇసుకను పొరుగునే ఉన్న తెలంగాణ రాష్ట్రానికి రవాణాకు కొందరు బరితెగించారు. అధికార పార్టీకి అనుకూలురుగా ఉన్న కొందరు తమకు పెద్దల అండ, దండ ఉన్నాయని చెప్పి అక్రమ రవాణాకు ప్రయత్నించారు. సమాచారం అందుకున్న కలెక్టర్ వెట్రిసెల్వి అధికార బృందాలను రంగంలోకి దించి ఇసుక అక్రమ రవాణా వాహనాలను సీజ్ చేయించారు. అప్పటికే జరగాల్సిన నష్టం కొంత జరిగింది. పొరుగున తెలంగాణకు ఇసుక చేరవేతలో కొందరు సాహసించడం, కొందరు మద్దతు పలకడం, ఇంకొందరు చూసీచూడనట్టు వదిలేయడం వంటి పరిణామాలు చోటు చేసుకున్నాయి. అసలు ఏపీలో ఉచిత ఇసుకవిధానం అమలుకు సిద్ధపడుతున్న వేళ తెలంగాణకు అంత ధైర్యంగా ఇసుక అక్రమ రవాణాకు పాల్పడిన కొందరు ఈ విషయాన్ని మరుగుపడేలా ప్రయత్నించారు.

అందుబాటులో లేదు

రాష్ట్రంలో నిర్మాణ రంగానికి మంచి ఊపునిచ్చేలా కూటమి ప్రభుత్వం ఉచిత ఇసుక విధానం అమలులోకి తెచ్చినా ఇప్పుడున్న పరిస్థితుల్లో నిర్మాణ రంగానికి అనువుగా ఎక్కడా ఇసుక అందుబాటులో లేదు. అప్పట్లో వైసీపీ ప్రభుత్వం తెగబడి దొరికినకాడికల్లా దోచి అదేక్రమంలో ఇసుకను ఎక్కడికక్కడ ప్రైవేటు భూముల్లోకి చేరవేసింది. కొందరు అప్పటి వైసీపీ పెద్దలకు కప్పం కట్టి మరీ ఇసుక విక్రయించుకున్నారు. అంతకంటే మించి ఇసుక ఎక్కడికైనా రవాణాకు వీలుగా అప్పటి పెద్దలు దళారులకు సహకరించారు. కాని ఇదే తరుణంలో అటువంటి చౌకబారు విధానానికి వ్యతిరేకంగా అందరికీ ఇసుక అందాలని ప్రవేశపెట్టిన ఉచిత ఇసుక విధానంతో తొలి రెండు నెలల్లోనే సీన్ తిరగబడింది. తగినంత ఇసుక స్టాక్ పాయింట్‌లో లేకపోవడం, ఉన్న కొద్దిపాటి నిల్వలు ఆన్‌లైన్‌లో వినియోగదారులు పొందడంతో స్టాక్ పాయింట్లన్నీ దాదాపు ఖాళీ అయ్యాయి. వాస్తవానికి ఏలూరుజిల్లా వ్యాప్తంగా ఇసుకను పొందాలంటే అటు చేబ్రోలు, ఇటు 130 కిలోమీటర్లకు పైబడి దూరాన ఉన్న కుక్కునూరు మండలం ఇబ్రహీం పేట వద్ద స్టాక్ పాయింట్లపై అంతా ఆధారపడాల్సి వచ్చింది. దూర ప్రాంతంలో ఉన్న కుక్కునూరు నుంచి ఇసుకను పొందడానికి రవాణా చార్జీలు తడిసిమోపెడైన కారణంగా ఎవరికి వారే నిస్సహాయత వ్యక్తం చేశారు. ఉచిత ఇసుక విధానం అమలులోకి వచ్చిన వెంటనే ఎక్కడికక్కడ జిల్లా వ్యాప్తంగా ప్రజలు హర్షామోదాలు వ్యక్తం చేశారు. ఆ వెను వెంటనే ఎక్కడికక్కడ శంకుస్థాపనలు జరిగాయి. గత నెలలో ఉచిత ఇసుక విధానం ఆరంభించేనాటికి చేబ్రోలు స్టాక్ పాయింట్‌లో 544 మెట్రిక్ టన్నులు, ఇబ్రహీంపేటలో 74 వేల మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉన్నాయి. దీంట్లో చేబ్రోలు స్టాక్‌పాయింట్‌లో ఉన్న ఇసుక నిర్మాణానికి పనికి వస్తుందా, రాదా అనే నిర్ణయాలు ఆదిలోనే వ్యక్తమయ్యాయి. అక్కడున్న ఇసుకలో మట్టి శాతం ఉండడంతో వినియోగదారులు వెనుకంజ వేశారు. దీనిని మైనింగ్ అధికారులు అప్పట్లోనే దాదాపు నిర్ధారించారు కూడా. ఇంకోవైపు ఇబ్రహీంపేటలో ఉన్న ఇసుక నిల్వలు సంతృప్తికరమే అయినా ఒక్కో మెట్రిక్ టన్నుకు నిర్వహణ చార్జీలు 210 రూపాయలు చెల్లించాల్సి రావడం, దీనికి రవాణా చార్జీలు అదనం కావడంతో జిల్లాలో అత్యధికులు ఎక్కడికక్కడ వెనక్కి తగ్గారు. వింజరం గ్రామంలో 1200 మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వలు ఉన్నా అక్కడి నుంచి ఇసుక వినియోగదారులకు రవాణా చేసేందుకు సిద్ధపడలేదు. దీంతో ఉచిత ఇసుక ఆదిలోనే అందరినీ సంతృప్తిపర్చలేకపోయింది.

డీసిల్టేషన్ పాయింట్లు ఎక్కడ?

ఉచిత ఇసుక విధానంతో ప్రజలకు కావలసినంత ఇసుక అందుబాటులో ఉంటుందని అంచనా వేసినా దీనికి విరుద్ధమైన సంకేతాలే ఉన్నాయి. వర్షాకాలం ఆరంభం కావడం, నదులు, వాగులు పొంగడంతో ఇసుకను ఆయా స్టాక్ పాయింట్లకు తరలించలేకపోయారు. కానీ గోదావరి నుంచి ఇసుకను నిర్దేశిత ప్రాంతానికి రప్పించాలంటే కొత్తగా డీసిల్టేషన్ పాయింట్లు గుర్తించాల్సి ఉంది. ఆ మేరకు మైనింగ్ అధికారులే తగిన చొరవ తీసుకుని ప్రభుత్వానికి ప్రతిపాదించి ఆమోదముద్ర పొందాల్సి ఉంది. కాని డీసిల్టేషన్ పాయింట్లు ఎక్కడెక్కడ పెట్టబోతున్నారనే విషయాన్ని సైతం ఇప్పటికే మైనింగ్ శాఖ గోప్యంగా ఉంచింది. సాధ్యమైనంత మేర ఇసుక అందుబాటులోకి వస్తే తమ జీవితాలు బాగుంటాయని నిర్మాణ రంగ కార్మికులు పెట్టుకున్న ఆశలు తాజాగా నెలకొన్న ఇసుక కొరతతో ఆవిరి అయ్యాయి. సాధారణంగా ఒక విధానం అమలులోకి వచ్చిన తొలినాళ్లలో బాలారిష్టాలు ఎలాగూ ఉంటాయి. ఇసుక విధానంలో అన్ని చోట్ల అవే ఎదురయ్యాయి. ఈ సీజన్‌లో భారీ వర్షాలతో ఎక్కడికక్కడ గోదావరితో పాటు కొండ ప్రాంతాల వాగులు కూడా పొంగిపొర్లాయి. చేసేదిలేక ఎక్కడికక్కడ ఇసుకను అందుబాటులోకి తేలేకపోయారు. అక్టోబరు నాటికి గాని పరిస్థితి చక్కదిద్దలేమని చెబుతుండగా పనిలో పనిగా ఈలోపే ముహూర్తాలు ముంచుకురావడంతో భవన నిర్మాణం పూర్తి చేసేందుకు తాపత్రయపడేవారి సంఖ్య ఎక్కువగా ఉంది. అందుకనే వీలైతే అధిక ధర చెల్లించైనా సరే దళారుల నుంచి ఇసుక పొందడానికి ప్రయత్నిస్తున్న వారూ లేకపోలేదు.

సీనియర్లకూ సర్దుబాటు

- 99 శాతం వర్క్ అడ్జస్ట్‌మెంట్ మండల పరిధికే పరిమితం
- జీవో 117 మేలుపై టీచర్లకు నచ్చజెప్పే బాధ్యత ఎంఈవోలదే
- నేడు ఎంఈవోల లాగిన్‌కు సర్‌ప్లస్ టీచర్ల జాబితాలు
- తప్పుల సవరణలకు మరో అవకాశం

ఏలూరు అర్బన్, ఆగస్టు 13: టీచర్ల పని సర్దుబాటును కొద్దిపాటి మార్పులతో కొనసాగించాలని విద్యాశాఖ ఉన్నతాధికారులు నిర్ణయానికి వచ్చారు. మంగళవారం సాయంత్రం నిర్వహించిన వెబెక్స్ సమావేశంలో ఈ మేరకు ఉపాధ్యాయుల పని సర్దుబాటుపై కొన్ని సవరణలను ప్రకటించారు. ఇప్పటివరకు గుర్తించిన సర్‌ప్లస్ టీచర్లను ఆయా పాఠశాలల నుంచి ఇతర పాఠశాలలకు సర్దుబాటు చేయాల్సివచ్చినపుడు సంబంధిత స్కూలులో జూనియర్‌నే కదపాలని మార్గదర్శకాలున్నాయి. తాజాగా సీనియర్ ఎవరైనా సర్దుబాటుకు అంగీకారం తెలిపితే పరిగణనలోకి తీసుకోవాలని ఆదేశించారు. 70శాతం అంగవైకల్యంతో సర్‌ప్లస్ పరిధిలోకి వచ్చే ఉపాధ్యాయులను పని సర్దుబాటు నుంచి మినహాయించాలని నిర్ణయం తీసుకున్నారు. మొత్తంమీద సర్దుబాటును 99 శాతం మేర సంబంధిత మండల పరిధిలోనే చేయాలని, ఇంకా ఎవరైనా సర్‌ప్లస్‌లో సబ్జెక్టు టీచర్లుంటే వారిని మాత్రమే డివిజన్ పరిధిలోకి తీసుకురావాలని, ఎస్టీటీలను మాత్రం మండలానికే రీబ్యాక్ చేయాలని సూచించారు. దీంతోపాటు డివిజన్ పరిధిలోకి వచ్చే సబ్జెక్టు టీచర్ల అవసరం లేకపోయినా వెనక్కి పంపించి వేయవచ్చని వివరణనిచ్చారు. కాగా ప్రాథమికోన్నత పాఠశాలల్లో రోల్ 98 మంది విద్యార్థులకంటే తక్కువ ఉందన్న కారణంతో అక్కడి స్కూలులో స్కూల్ అసిస్టెంట్ కేడర్ సబ్జెక్టు టీచర్లందరినీ తీసేసి, ఎస్టీటీ కేడర్ ఉపాధ్యాయులను ఇవ్వడంవల్ల విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలకు టీసీలు ఇచ్చేయాల్సిందిగా ఒత్తిడి తెస్తున్నారని పలువురు ఎంఈవోలు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై తాము నిబంధనల మేరకే వ్యవహరించామని ఇప్పటికిప్పుడు ఈ సమస్యను పరిష్కరించలేమని ఉన్నతాధికారులు తేల్చిచెప్పారు. జీవో 117 ఉత్తర్వులను కూడా ఇప్పటికిప్పుడే మార్చే అవకాశాలు లేవని, భవిష్యత్‌లో నిర్ణయాన్ని తీసుకుంటామని వివరించారు. ఉపాధ్యాయులకు జీవో 117 ఉత్తర్వుల వల్ల జరిగే మేలు గురించి నచ్చజెప్పాలని ఎంఈవోలకు సూచించారు. అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు పూర్తిస్థాయిలో బోధించేందుకు సరిపడా ఉపాధ్యాయులను అందుబాటులో ఉంచేందుకే పని సర్దుబాటును చేపట్టినట్టు వివరించాలని, సుదూర ప్రాంతాలకు సర్దుబాటుచేస్తారనే అపోహలను వీడాలని టీచర్లకు చెప్పాలని కోరారు. సవరించిన సూచనలతో మండలాల వారీగా సర్‌ప్లస్ టీచర్ల జాబితాలను బుధవారం ఎంఈవోల లాగిన్‌కు పంపిస్తామని, వీటిలో ఏవైనా అభ్యంతరాలుంటే నిర్దేశిత ప్రొఫార్మాలో నమోదుచేసి మధ్యాహ్నం 3గంటల్లోగా రాష్ట్ర కార్యాలయానికి పంపిస్తే వాటిని పరిష్కరించి తుది సీనియార్టీ జాబితాలను 16న పంపిస్తామని, మండలాల్లో 17న ఆన్‌లైన్ కౌన్సెలింగ్‌ద్వారా సర్దుబాటు జరగాలని ఆదేశించారు. ఇదిలాఉండగా అన్ని ఉపాధ్యాయ సంఘాల నాయకులతో బుధవారం విద్యాశాఖ డైరెక్టర్ సమన్వయ సమావేశాన్ని నిర్వహించనున్నారు.

కుళ్లిన కూరగాయలు



కూరగాయలను పరిశీలిస్తున్న డీఈవో అబ్రహం

- భోజనం నాణ్యతపై ఫిర్యాదులు
- ముసునూరు గురుకుల బాలికల పాఠశాలలో డీఈవో తనిఖీ
- వంటశాలలో కుళ్లిన కూరగాయలు స్వయంగా పరిశీలన
- వార్డెన్, సిబ్బందిపై ఆగ్రహం

ముసునూరు, ఆగస్టు 13: ముసునూరు గురుకుల పాఠశాలలో బాలికలకు పెట్టే భోజనం తయారీపై జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.అబ్రహం అసహనం వ్యక్తం చేశారు. వంటశాలలో కుళ్లిన కూరగాయలను గుర్తించిన డీఈవో వార్డెన్, సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గురుకుల పాఠశాలలో నాసిరకం భోజనం పెడుతున్నారని ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు విద్యార్థుల తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. మంగళవారం పాఠశాలను డీఈవో ఆకస్మిక తనిఖీ చేశారు. 9, 10 తరగతి విద్యార్థుల నుంచి భోజనం నాణ్యత, మెనూ ప్రకారం భోజనం, వార్డెన్ పనితీరు తదితర విషయాలపై ఆయన సమాచారం రాబట్టారు. అనంతరం వంటశాలను పరిశీలించి ఆహార పదార్థాల నాణ్యతను తనిఖీ చేశారు. వంటశాలలో కూరగాయలను సైతం ఆయన పరిశీలించగా, బెండకాయలు, టమోటాలు, దోసకాయలు కుళ్లిపోయినట్లు గుర్తించారు. కూరగాయలు నిల్వ చేసుకునే విధానం ఇదేనా? కుళ్లిన కూరగాయలనే విద్యార్థులకు వండి పెడతారా? అంటూ వార్డెన్, వంట సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాల ప్రాంగణాన్ని పరిశీలించిన ఆయన చెత్తాచెదారాన్ని, పిచ్చిమొక్కలు, వెంటనే తొలగించాలని సూచించారు. కూరగాయలు నిల్వ చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన వంట సిబ్బంది, కూరగాయల కాంట్రాక్టర్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని, ప్రిన్సిపల్ కె.ప్రవీణను డీఈవో ఆదేశించారు.

అనంతరం డీఈవో విలేకరులతో మాట్లాడుతూ గురుకుల పాఠశాలలో బాలికలకు ఆహారం సక్రమంగా అందడం లేదని వచ్చిన ఫిర్యాదు మేరకు పాఠశాలను తనిఖీ చేశామన్నారు. విద్యార్థినులు పలు విషయాలు తన దృష్టికి తీసుకువచ్చారన్నారు. పాఠశాలలో భోజనానికి సంబంధించి, బాలికలు చెప్పిన విషయాలపై సమగ్ర నివేదికను తయారుచేసి జిల్లా ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు డీఈవో తెలిపారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులతో సమావేశమై పలు సూచనలు ఇచ్చారు. ఎంఈవో బీవీ సుబ్బారావు, ఎస్ఎంసీ చైర్మన్ ఎస్.పంగిడయ్య, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



జాతీయ జెండా ఆవిష్కరణ రిహార్సల్

స్వాతంత్ర్య దినోత్సవ పరేడ్ రిహార్సల్

సిబ్బందికి సూచనలు ఇచ్చిన ఎస్పీ

ఏలూరు క్రైం, ఆగస్టు 13 : స్వాతంత్ర్య దినోత్సవంగా సందర్భంగా ఈనెల 15న నిర్వహించే వేడుకలకు పోలీస్ శాఖ రిహార్సల్ చేస్తోంది. ఏలూరు పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో రిహార్సల్‌ను ఎస్పీ కేపీఎస్ కిశోర్ మంగళవారం పరిశీలించారు. పోలీస్ సిబ్బంది కవాత్ ఏవిధంగా నిర్వహించాలి, పరేడ్ ఎలా ఉండాలి, ప్రజలను ఏ ప్రాంతంలో కూర్చోబెట్టాలి. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా తీసుకోవలసిన చర్యలపై ఎస్పీ సూచనలు ఇచ్చారు. ముఖ్యఅతిథి జాతీయ జెండా ఆవిష్కరించడం, పోలీస్ కవాతు పరిశీలించడం, పోలీస్ గౌరవవందనాన్ని స్వీకరించడం వంటి అంశాలను ఎస్పీ స్వయంగా పరిశీలించి కొన్ని సూచనలు ఇచ్చారు. పోలీసు జాగిలాల విన్యాసాలను కూడా చూశారు. అంతా సవ్యంగా ఉందని, ఇదే ఉత్సాహంతో ఈ నెల 15న స్వాతంత్ర్య దినోత్సవ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించుకుందామని అధికారులకు సూచించారు. ఏఆర్ ఏఎస్పీ ఎన్ఎస్ఎస్ శేఖర్, ఏఆర్ డీఎస్పీ శేఖర్, ఆర్ఐ పవన్ కుమార్ పాల్గొన్నారు.



గౌరవవందనం చేస్తున్న పోలీసులు


గుమస్తాతో వాగ్వాదం చేస్తున్న శ్రీపర్రు గ్రామస్థులు

సొమ్ము ఇవ్వకుంటే ముట్టడిస్తాం

చెరువు లీజు సొమ్ము కోసం మాజీ ఎమ్మెల్యే ఇంటి దగ్గర శ్రీపర్రు గ్రామస్థుల నిరసన

పెదవేగి, ఆగస్టు 13 : చెరువుల లీజు సొమ్ము తన దగ్గర పెట్టుకుని ఇవ్వకుండా ముఖం చాటేసిన మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి.. లీజు సొమ్ము తక్షణం చెల్లించాలని కోరుతూ శ్రీపర్రు గ్రామస్థులు మంగళవారం ఆయన ఇంటి దగ్గర నిరసన తెలిపారు. పెదవేగి మండలం కొండలరావు పాలెంలోని అబ్బయ్యచౌదరి ఇంటికి శ్రీపర్రు నుంచి భారీగా చేరుకున్న గ్రామస్తులు ఇంటి ఎదుట నినాదాలు చేశారు. అబ్బయ్య చౌదరి ఇంటి దగ్గర లేకపోవడంతో సొమ్ము విషయమై గుమస్తాకు వివరించి లీజు సొమ్ము ఇవ్వకపోతే ఇంటి దగ్గర ధర్నా చేపడతామని హెచ్చరించారు. శ్రీపర్రుకు చెందిన 75 ఎకరాల చేపల చెరువు కోమటిలంక గ్రామంలో ఉందని, ఆ చెరువులకు సంబంధించి గ్రామస్తులకు రావాల్సిన కౌలు సొమ్ము తన దగ్గర పెట్టుకుని ఎన్నిసార్లు అడిగినా అధికార దర్పంతో ఇవ్వలేదని గ్రామస్తులు ఆరోపించారు. విదేశాల నుంచి వస్తారో? ఇక్కడ ఉన్నవారితో ఆ సొమ్ము కట్టిస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. అధికారంలో ఉన్న సమయంలో సొమ్ము విషయంలో ప్రశ్నించిన శ్రీపర్రుకు చెందిన సైదు గోరవర్ధన్‌పై అక్రమ కేసులు బనాయించడంతో పాటు రౌడీ షీటు కూడా ఓపెన్ చేయించారని ఆరోపించారు. ప్రశ్నించే ప్రతి ఒక్కరిపై భౌతిక దాడులకు తెగబడ్డారని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సొమ్ము ఇవ్వకుండా తండ్రీ, కొడుకులు పారిపోయారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పెదవేగి ఇన్‌చార్జ్ సీఐ అబ్దుల్ నబీ ఆధ్వర్యంలో పోలీసులు గ్రామస్తులను సముదాయించి అక్కడ నుంచి పంపేశారు.

ఎమ్మెల్యే చింతమనేనికి మాజీ ఎమ్మెల్యే బెదిరింపులు

ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు

ఏలూరు క్రైం, ఆగస్టు 13 : దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌కు మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి, అతని అనుచరులు గత కొంతకాలం నుంచి రకరకాల నెంబర్ల నుంచి ఫోన్లు చేసి బెదిరించడంతో ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏలూరు త్రిటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌కు గత కొంత కాలం నుంచి దెందులూరు మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి, అతని ప్రధాన అనుచరుడు కామిరెడ్డి నాని, అతని అనుచరులు రకరకాల సెల్ నెంబర్ల ద్వారా బెదిరింపులకు పాల్పడుతూ అసభ్యంగా దుర్భాషలాడారు. దీంతో దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఏలూరు త్రిటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి, కామిరెడ్డి నాని వారి అనుచరులపై కేసు నమోదు చేసి కేసు దర్యాప్తు చేస్తున్నారు. సుమారు 40 నెంబర్లకు పైగా వారు వినియోగించి బెదిరింపులకు పాల్పడ్డారని ఫిర్యాదులో పేర్కొనగా పోలీసులు ఆ దిశగా దర్యాప్తు చేపట్టారు.

కరుగోరుమిల్లిలో వెలి కేసుపై విచారణ



ఆచంట, ఆగస్టు 13 : ఆచంట మండలం కరుగోరుమిల్లికి చెందిన గూడూరి వరలక్ష్మి తనను గ్రామానికి చెందిన కొంతమంది కుల సంఘం నాయకులు వెలి వేశారని గత నెల 15వ తేదీన జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసింది. కలెక్టర్ డీఎస్పీకి అప్ప గించడంతో డీఎస్పీ ఆదేశాల మేరకు గురువారం ఆచంట ఆర్ఐ జయలలిత స్థానిక వీఆర్వో చిట్టూరి శ్రీహరిలు గ్రామంలో విచారణ చేపట్టారు. వరలక్ష్మి గ్రామానికి చెందిన 12 మంది కుల సంఘం నేతలు తనను వెలి వేశారని చేసిన ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టినట్లు ఆర్ఐ తెలిపారు. వివరాలు సేకరించామని వీటిని ఉన్నతాధికారులకు పంపించామన్నారు. దీనిపై వరలక్ష్మి స్థానిక పోలీసు స్టేషన్‌లో కూడా ఫిర్యాదు చేసింది.


వివరాలు తెలుపుతున్న తాడేపల్లిగూడెం డీఎస్పీ మూర్తి

ఇళ్ల ముందు బైక్‌లే టార్గెట్

14 మోటారు సైకిళ్లు స్వాధీనం..ఐదుగురి అరెస్టు



తాడేపల్లిగూడెం రూరల్, ఆగస్టు 13: ఇళ్ల ముందు ఉంచిన మోటారుసైకిల్స్‌ను నిఘా వేసి అపహరించే ఐదుగురిని తాడేపల్లిగూడెం పట్టణ పోలీసులు పట్టుకుని వారి నుంచి రూ.9 లక్షల విలువ చేసే 14 మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. డీఎస్పీ మూర్తి మంగళవారం విలేకరుకు వివరాలు తెలియ జేశారు. తాడేపల్లిగూడెంకు చెందిన గుత్తుల జయప్రకాష్, బత్తుల యేసు వర్మ, ముసిరి నరేష్, ఉంగుటూరు మండలం వెల్లమిల్లికి చెందిన తప్పెటల శశికుమార్, ఉండి మండలం మహదేవుని పట్నంకు చెందిన వీరవల్లి వెంకటేష్ (పరారీలో ఉన్నాడు) ముఠాగా ఏర్పడ్డారు. రాత్రి సమయంలో ఇళ్ల వద్ద పార్కు చేసిన మోటారు సైకిళ్లపై నిఘా పెడతారు.ఆ బృందంలో కొందరు సీసీ కెమెరాలు లేని ప్రాంతాన్ని ఎంపిక చేస్తారు. మోటారుసైకిళ్ల హ్యాండిల్ లాక్‌ను తొలగించ డంలో కూడా వీరు నిపుణులు. వారు చోరీ చేసిన మోటారుసైకిళ్లను తాడేపల్లి గూడెం మండలం బంగారుగూడెంకు చెందిన మెకానిక్ నరసింహ మూర్తికి అప్పగిస్తే అతని వద్దకు వచ్చే కస్టమర్‌లకు విక్రయిస్తుంటాడు. తాడేపల్లిగూడెం, తణుకు, గణపవరం స్టేషన్‌ల పరిధిలో జరుగుతున్న చోరీలపై సీరియస్‌గా తీసుకున్న ఎస్పీ అద్నాన్ నయిం ఆదేశాల మేరకు పోలీసులు నిఘా పెట్టారు. నల్లజర్ల రోడ్డులోని పెట్రోల్ బంకు సమీపంలో మంగళవారం వాహనాల తనిఖీలో అనుమానాస్పదంగా ఉన్న ఈ ముఠాలోని సభ్యులను పట్టుకుని విచారించగా అసలు విషయం బయట పడింది. నిందితుల దగ్గర రూ.9 లక్షల విలువ చేసే 14 మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. సీఐ సుబ్రహ్మణ్యం, ఎస్సై సుధాకర రెడ్డి, సిబ్బందిని డీఎస్పీ మూర్తి అభినందించారు.

ఇంటి ఎదురుగా పార్కు చేసిన కొత్త బైక్ మాయం

ఆకివీడు, ఆగస్టు 13 : ఇంటి ఎదురుగా పార్కు చేసిన హుండా యాక్టీవ్ కనబడుట లేదని ఫిర్యాదు మేర ఎస్ఐ బత్తిన నాగబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆకివీడు వివేకానందనగర్ కాలనీకి చెందిన గంట్యాడ రాము ఈ నెల 6న కొత్త యాక్టివా బైక్ కొన్నాడు. 8వ తేదీ రాత్రి ఇంటి ఎదురుగా పార్కు చేసి మరుసటి రోజు ఉదయం చూసే సరికి కనబడలేదు. దీంతో మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ కేసు నమోదు చేశారు.

ANDHRA JYOTHI AJC CLASSIFIEDS
ఆంధ్రజ్యోతి DAILY CLASSIFIEDS
క్లాసిఫైడ్స్ (ప్రతిరోజూ)

మా చిత్రంలో నటించే అవకాశం
★ శ్రీ వెంకట లక్ష్మీనరసింహ ప్రొడక్షన్స్‌లో లాల నాయకిని చిత్రం సెప్టెంబర్ 19న రామానాయుడు స్టూడియోలో షూటింగ్ ప్రారంభం. అన్ని వయసుల కొత్త వారికి యాక్టింగ్ ఫ్రీగా నేర్పిస్తున్నాం. మా సినిమాలో అవకాశం ఇస్తున్నాం. ... సెల్. 7981403355కు పంపండి. ఫిలింనగర్ Hyd. ... AJH-002570

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో ... పాఠకులకు సూచించడమైనది. ... ఆంధ్రజ్యోతి ... పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడీవిటి

మా రోడ్డుకు మోక్షమెప్పుడు ?

ఇరవై ఏళ్లుగా ఎదురుచూపులు

బోయగూడెం, సీతానగరం వాసుల అవస్థలు


అధ్వానంగా ఉన్న బోయగూడెం- సీతానగరం రోడ్డు

చింతలపూడి, ఆగస్టు 13: మండలంలోని బోయగూడెం, సీతానగరం రోడ్డుకు మోక్షం ఎప్పుడా అని ఆ గ్రామాల ప్రజలు ఎదురుచూస్తున్నారు. ఈ రోడ్డు దెబ్బతినడంతో 20 ఏళ్లుగా గ్రామాల ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. 20 ఏళ్లలో శాసనసభ్యులు మారారు. పిల్లలు పెద్దవాళ్ళు అయ్యారు. 15 సంవత్సరాలుగా బస్సులు కూడా తిరగడం లేదు. కాలి బాటనే ఈ గ్రామాల ప్రజలు నిత్యం చింతలపూడికి వస్తుంటారు. 17 కిలోమీటర్ల పొడవున మూడు గ్రామ పంచాయతీలు, 11 శివారు గ్రామాలు ఉన్నాయి. ఎన్నికలు వచ్చినప్పుడల్లా నాయకులు హామీలతో సరిపెడుతూ వస్తున్నారు. ఈ గ్రామాల ప్రజలు ధర్నాలు జరిపారు. ప్రజాప్రతినిధులను, అధికారులను నిలదీశారు. 2018లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈ రోడ్డు నిర్మాణం కోసం రూ.8 కోట్లు మంజూరుచేసి శంకుస్థాపన కూడా జరిపారు. 2019లో ప్రభుత్వం మారినా ఈ రోడ్డుకు మోక్షం కలగలేదు. ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో కనీసం ఊసు కూడా ఎత్తలేదు. మోసపోయామని గ్రామాల ప్రజలు భావించారు. అయితే 2023లో ఎన్నికలు వస్తున్న సమయాన్ని చూసుకుని హడావుడిగా వైసీపీ నాయకులు ఈ రోడ్డుకు రూ.20 కోట్లు మంజూరయ్యాయంటూ హడావుడి చేశారు. వైసీపీ పాలనలో బిల్లులు మంజూరు అవ్వడం లేదని, కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదని ఆ గ్రామాల ప్రజలకు నాయకులు సర్ది చెప్పారు.ఈ రోడ్డంతా గోతులమయంగా మారింది. శెట్టివారిగూడెం వద్ద గ్రామస్థులు కొందరు కలుగచేసుకుని కొంత మేర వాహనాలు తిరిగే విధంగా మట్టి పోసుకున్నారు. అది ఎన్నాళ్లో నిలువ లేదు. పామాయిల్, వరి, వేరుశెనగ, అరటి, మామిడి పంటలు తరలించటానికి రైతులు పడుతున్న కష్టాలు వర్ణనాతీతం. విద్యార్థులు చదువుల కోసం ఆటో, లేదంటే ఏదో వాహనాన్ని పట్టుకుని పాఠశాలలకు వచ్చి వెళ్లాల్సిందే. 20 సంవత్సరాలుగా ఇదే తంతు. ఇప్పుడు ప్రభుత్వం ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం పథకం అమలు చేయనున్నది. ఈ గ్రామాల ప్రజలు ఇప్పుడు మావూరికి బస్సు ఏదంటూ నాయకులను ప్రశ్నిస్తున్నారు. గతంలో 15 ఏళ్ళ కిందటే 8 బస్సు సర్వీసులు తిరిగేవి. ఇప్పుడు జనాభా పెరిగారు ? రవాణా అవసరాలు పెరిగాయి. కూటమి ప్రభుత్వంలో ఈ రోడ్డు నిర్మాణం జరుగుతుందని ఎంతో ఆశగా ఎదురు చూస్తున్నారు. మా రోడ్డుకు మోక్షం కలిగిస్తారా అంటూ గ్రామాల ప్రజలు ఎదురు చూస్తున్నారు.


సీఆర్ఆర్ విద్యాసంస్థల అధ్యక్షుడు అల్లూరి ఇంద్రకుమార్‌కు విరాళం చెక్కు అందజేస్తున్న వీఎస్పీ ప్రతినిధులు

సీఆర్ఆర్ సొసైటీ అభివృద్ధికి అక్కినేని కుటుంబ సభ్యుల విరాళం

ఏలూరు అర్బన్, ఆగస్టు 13 : సీఆర్ రెడ్డి విద్యాసంస్థల సొసైటీ అభివృద్ధి నిమిత్తం దివంగత వీరమాచనేని శివరామప్రసాద్ జ్ఞాపకార్థం ఆయన కుమార్తెలు అక్కినేని జ్యోత్స్న, వేములపల్లి సునీత వీఎస్పీ ఫౌండేషన్ తరపున రూ.కోటి విరాళాన్ని బ్యాంకు చెక్కు ద్వారా సీఆర్ఆర్ విద్యాసంస్థల అధ్యక్షుడు డాక్టర్ అల్లూరి ఇంద్రకుమార్‌కు ఏలూరులో అందజేశారు. ప్రముఖ సినీ నటుడు దివంగత అక్కినేని నాగేశ్వరరావు కుటుంబసభ్యులు అక్కినేని ఆదిత్య, వేములపల్లి రోహిత్, మొటపర్తి వెంకట్, సీఆర్ఆర్ విద్యాసంస్థల కార్యదర్శి డాక్టర్ ప్రసాద్, కోశాధికారి చిట్టూరి జానకిరామయ్య, ఉపాధ్యక్షుడు డాక్టర్ వి.వి.బాలకృష్ణారావు, సుబ్రహ్మణ్యం, సంయుక్త కార్యదర్శి కొడాలి వెంకట సుబ్బారావు, ఇతర మేనేజింగ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సుల్లో దేవాలయ భూముల సమస్యలపై దృష్టి పెట్టండి

భీమవరం టౌన్, ఆగస్టు 13 : ఈనెల 16వ తేదీ నుంచి జిల్లాలో జరిగే రెవెన్యూ సదస్సులో పాల్గొనేందుకు, దేవదాయ శాఖకు సంబంధించిన సమస్యలను పరిష్కరించుకునేందుకు 20 మండలాలకు సంబంధించి 65 మందిని నియమించినట్టు దేవదాయ శాఖ జిల్లా అధికారి సుబ్బారావు తెలిపారు. ప్రతీ మండలానికి ఒక ఈవోతో పాటు ఇద్దరు గుమస్తాలను నియమించామని చెప్పారు. రెవెన్యూ సదస్సు జరిగే గ్రామంలోని దేవాలయాలకు సంబంధించి రెవెన్యూ రికార్డుల్లో నమోదు సక్రమంగా జరిగాయా లేదా సరి చూసుకుని ఇబ్బందులు ఉంటే వెంటనే దరఖాస్తు చేసి సమస్యను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీచేశామన్నారు. సర్వే నెంబర్లను సరిచూసుకోవాలన్నారు. సదస్సులో జరిగిన వివరాలను అదే రోజు సాయంత్రంలోగా జిల్లా కార్యాలయానికి అందించాలన్నారు.



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ నాగరాణి, జిల్లా ఎస్పీ నయీం అస్మి

బ్లాక్ స్పాట్స్ వద్ద ప్రత్యేక భద్రతా చర్యలు

పశ్చిమ గోదావరి జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి

భీమవరం క్రైం, ఆగస్టు 13 : ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న బ్లాక్ స్పాట్స్‌ను గుర్తించామని, జంక్షన్లు, ముఖ్యంగా జాతీయ రహదారితో, స్థానిక రహదారులు కలిసే ప్రదేశాల్లో ఎక్కువగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి తెలిపారు. పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ నాగరాణి, ఎస్పీ నయీం ఆధ్వర్యంలో మంగళవారం రహదారి భద్రతా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లాలో తరచుగా ప్రమాదాలు జరుగుతున్న ప్రదేశాలు, వాటికి గల కారణాలు, నివారణా చర్యలపై చర్చించారు. ఎస్పీ మాట్లాడుతూ జాతీయ రహదారుల జంక్షన్లు వద్ద లైటింగ్ పెంచాలన్నారు. హెల్మెట్ వాడకం, రహదారి భద్రతా నియమాలు పాటించకపోతే విధించబడే జరిమానాలు తదితర అంశాలపై పోలీస్, రవాణా శాఖలు అవగాహనా కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులంతా విధిగా హెల్మెట్ ధరించేలా వారిని చైతన్య పరచాలని కోరారు. ఆర్‌అండ్‌బీ, జాతీయ రహదారులు, పంచాయతీ, మున్సిపాలిటీలు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న ప్రదేశాలను గుర్తించి జాబితాను అందజేయాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాదాలను పూర్తిగా నివారించేందుకు తగిన ప్రణాళిక రూపొందించాలని కలెక్టర్ ఎస్పీని కోరారు. సమావేశంలో అదనపు ఎస్పీ (అడ్మిన్) భీమారావు, అదనపు ఎస్పీ (ఎస్‌బీ)రవికుమార్, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటర్న్‌షిప్‌కు ట్రిపుల్ ఐటీ విద్యార్థులు

నూజివీడుటౌన్, ఆగస్టు 13: నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్ ఈఈఈ విద్యార్థులు పెయిడ్ ఇంటర్న్‌షిప్ పొందినట్లు ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ఎస్.చంద్రశేఖర్ తెలిపారు. ఈఈఈ చివరి ఏడాదికి చెందిన 18 మంది విద్యార్థులు హైదరాబాద్‌కు చెందిన ప్రీమియర్ ఎనర్జీ ఫొటో ఓల్టాయిక్ కంపెనీలో నెలకు రూ.15 వేలు స్టైపెండ్‌తో ఆరు నెలల ఇంటర్న్‌షిప్‌కు ఎంపిక య్యారన్నారు. వీరితో పాటు బిడ్ అలెర్ట్ కంపెనీలో మరో 20 మంది విద్యార్థులు ఇంటర్నషిప్‌కు ఎంపికైనట్లు తెలి పారు. విద్యార్థులను ఏవో పి.చంద్రశేఖర్, డీన్ ఆఫ్ అకడమిక్స్ రత్నాకర్ తదితరులు అభినందించారు.

ఈశాన్యంలో ఉంటే అరిష్టమట..

పంచాయతీలో పచ్చని చెట్లపై వేటు


ద్వారకాతిరుమల పంచాయతీలో చెట్లను నరికి ట్రాక్టర్‌పై తరలిస్తున్న దృశ్యం



ద్వారకాతిరుమల, ఆగస్టు 13: పంచాయతీకి కలసి రావడం లేదని పచ్చని చెట్లను కొట్టి పడేశారు. మొక్కలను పెంచి పోషించాలని ఓ వైపు అధికారులు ప్రచారం చేస్తుండగా ఇక్కడ మాత్రం ఏళ్లుగా పెరిగి పెద్దవైన పచ్చని చెట్లను నిర్దాక్షణ్యంగా నరికి వేశారు. ద్వారకా తిరుమల గ్రామ సచివాలయ కార్యాలయ ఆవరణలో ఉన్న పెద్ద పెద్ద చెట్లను మంగళవారం తొలగించారు.ఈశాన్యంలో ఇలా చెట్లు ఉంటే పంచాయతీకి అరిష్టమని ఓ సిద్ధాంతి చెప్పిన మాట పట్టుకుని చెట్లను నరికేశారు. ఏళ్లక్రితం నాటిన చెట్లను నిర్దాక్షిణ్యంగా కూలకొడుతున్నా స్థానిక అధికారులు పట్టనట్లు వ్యవహరించడం దారుణమని ప్రజలు అంటున్నారు. మొక్కల పెంచడం మాట అటుంచి ఉన్న చెట్లను కూడా కాపాడలేక పోతే ఎలా అని అంటున్నారు. పచ్చని చెట్లతో కళలాడుతూ ఉండే పంచాయతీ కార్యాలయ ఆవరణ వెలవెలబోయింది. దీనిపై పంచాయితీ కార్యదర్శి వెంకటేశ్వరరావు వివరణ కోరగా అడ్డం వస్తున్నాయని చెట్లను నరికి వేస్తున్నట్లు చెప్పారు.

సంక్షిప్త సవరణ ఓటర్ల జాబితాకు ఇంటింటా సర్వే నిర్వహించండి

భీమవరం టౌన్, ఆగస్టు 13 : సంక్షిప్త సవరణ ఓటర్ల జాబితా తయారీలో భాగంగా ఇంటింటా ఓటర్ల సర్వే నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్ ప్రధాన కార్యదర్శి వివేక్ యాదవ్ తెలిపారు. మంగళవారం వెలగపూడి సచివాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఈఆర్‌వోలతో సమా వేశం నిర్వహించారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్ చదలవాడ నాగరాణి, జిల్లా రెవెన్యూ అధికారి జె.ఉదయభాస్కరరావు పాల్గొన్నారు. ఎన్నికల ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ సంక్షిప్త సవరణ ఓటర్ల జాబితా రూపొందించడానికి ఈనెల 20 నుంచి అక్టోబరు 19వ తేదీ వరకు ఇంటింటా ఓటర్ల సర్వే ప్రక్రియ జరుగుతుందని తెలిపారు. అక్టోబరు 19వ తేదీ నుంచి 28వ తేదీ వరకు దరఖాస్తుల పరిశీలన, 29వ తేదీన సంక్షిప్త ముసాయిదా ఓటర్ల జాబితా రూపొందించాలన్నారు. అక్టోబరు 29 నుంచి నవంబరు 28వ తేదీ వరకు అభ్యంతరాలను స్వీకరిస్తామన్నారు. డిసెంబర్ 24వ తేదీలోగా అభ్యం తరాలపై వచ్చిన దరఖాస్తుల పరిశీలన, పరిష్కార కార్యక్రమం చేపట్టాల న్నారు. 2025 జనవరి ఒకటో తేదీలోగా నిబంధనల మేరకు జాబితా సిద్ధమైందో లేదో పరిశీలించాలన్నారు. జనవరి ఆరో తేదీన సంక్షిప్త సవరణ ఓటర్ల తుది జాబితా ప్రచురించాలని తెలిపారు. ఎన్నికల కమిషన్ సూచించిన మార్గ దర్శకాలు పక్కాగా అమలు చేయాలన్నారు.

ఆక్వా యూనివర్సిటీలో బీఎస్సీ సీట్ల భర్తీకి నోటిఫికేషన్

నరసాపురం రూరల్, ఆగస్టు 13: మండలంలోని లక్ష్మణేశ్వరం గ్రామంలో తుపాన్ భవనంలో నిర్వహిస్తున్న ఏపీ మత్స్య విశ్వ విద్యాలయంలో బీఎఫ్ఎస్సీ (బ్యాచిలర్ ఆఫ్ ఫిషరీస్ సైన్స్) నాలుగేళ్ల కోర్సుకు అడ్మిషన్ నోటిఫికేషన్ జారీ చేశారు. మొత్తం 60 సీట్లు ఉన్నాయి. ఇందులో స్థానికులకు 85 శాతం సీట్లు కేటాయించనున్నారు. మిగిలిన 15 శాతం తెలుగు రాష్ట్రాల్లోని విద్యార్థులు పోటీపడవచ్చు, ఫిజికల్ సైన్స్, బయోలాజికల్ నేచురల్ సైన్స్ ప్రధాన సబ్జెక్టులతో ఇంటర్ ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులు. ప్రభుత్వం నిర్వహించిన ఏపీఈఏపీసెట్ 2024 ర్యాంకు ఆధారంగా సీట్లు కేటాయించనున్నారు. ఆసక్తిగల విద్యార్థులు ఈనెల 20లోపు యూనివర్సిటీ వెబ్‌సైట్‌కు దరఖాస్తు చేసుకోవచ్చునని రిజిస్ట్రార్ సుధాకర్ పేర్కొన్నారు.

క్రైం కార్నర్


ప్రమాదంలో కాలిపోయిన ఇల్లు.. పేలిన గ్యాస్ సిలిండర్

గ్యాస్ సిలిండర్ పేలి ఇల్లు దగ్ధం

పెదపాడు, ఆగస్టు 13 : వంట చేస్తుండగా గ్యాస్ లీకై మంటలు రావడంతో ఇల్లు పూర్తిగా ధ్వంసమైన ఘటన పెదపాడు మండలం కొత్తూరులో మంగళవారం చోటు చేసుకుంది. కొత్తూరు బీసీ కాలనీలో నివాసముంటున్న దిమ్మిటి నాగేశ్వరమ్మ ఉదయం వంట చేస్తుండగా గ్యాస్ లీకై మంటలు చెలరేగాయి. వెంటనే ఆమె భయంతో బయటకు పరుగులు తీసింది. చుట్టుపక్కల వారు ఫైర్ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో ఏలూరు ఫైర్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు ఈ ప్రమాదంలో రేకుల ఇల్లు పూర్తిగా ధ్వంసమైంది.నగదుతో పాటుగా బంగారం కూడా కాలిపోయిందని నాగేశ్వరమ్మ తెలిపింది. బాధితురాలికి టీడీపీ నాయకులు ఉప్పలపాటి రాంప్రసాద్ లావేటి శ్రీనివాసరావు, కొత్తూరు చినబాబులు నిత్యావసర సరుకులు అందజేశారు. పెదపాడు ఎస్ఐ కె.శుభశేఖర్ బియ్యం, దుప్పట్లు, కూరగాయలను బాధితురాలికి అందజేశారు.

ముగ్గురిపై పోక్సో కేసు కొట్టివేత

బుట్టాయగూడెం, ఆగస్టు 13 : ముగ్గురిపై పోక్సో కేసును కొట్టివేస్తూ మంగళవారం పోక్సో స్పెషల్ కోర్టు జడ్జి సునంద తీర్పు ఇచ్చినట్టు డిఫెన్స్ న్యాయవాది ఏసుబాబు విలేకరులకు తెలిపారు. 2014లో బుట్టాయగూడెంలోని ఒక బాలికల వసతి గృహానికి చెందిన ముగ్గురు బాలికలపై లైంగిక వేధింపులు, అత్యాచారం జరిగిందని అప్పటి కొయ్యలగూడెం సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ బుట్టాయగూడెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన అప్పటి సబ్ డివిజన్ పోలీస్ అధికారి దర్యాప్తు చేపట్టారు. ఈ కేసులో వసతిగృహంలో అవుట్‌సోర్సింగ్‌గా పనిచేస్తున్న వర్కర్ గ్రామంలో కొందరు యువకులతో కుమ్మక్కై వారి నుంచి కొంత నగదు తీసుకుని బాలికలను వారివద్దకు పంపేదని హస్టల్ వెల్ఫేర్ అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసరుకు ఫోన్‌చేసి చెప్పడంతో ఏఎస్‌డబ్ల్యూ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసులో హస్టల్ వర్కర్‌తో పాటు ముగ్గురు యువకులపై కేసు నమోదు చేశారు. విచారణలో భాగంగా సాక్ష్యాలను తగలబెట్టారని హస్టల్ వెల్ఫేర్ ఆఫీసరుపై కేసు నమోదు చేసి పోలీసులు అరెస్టు చేశారు. మొత్తం 33 మందిని విచారించి పోలీసులు జిల్లా కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. సుదీర్ఘంగా 16 మంది సాక్షులను పోక్సో స్పెషల్ కోర్టు జడ్జి సునంద విచారించారు. నేరాన్ని రుజువుచేసే సాక్ష్యాలను కోర్టులో చేయలేక పోయినందున మంగళవారం కేసును కొట్టి వేసినట్లు న్యాయవాది ఏసుబాబు తెలిపారు. కేసులో మొదటి ముద్దాయి మరణించగా 5వ ముద్దాయిగా ఉన్న హస్టల్ వెల్ఫేర్ ఆఫీసరును ఉద్యోగం నుంచి తొలగించారు. అప్పటి ఏఎస్‌డబ్ల్యూవోను సస్పెండ్ చేశారు. ముద్దాయిల్లో ఒకరు బాల నేరస్తుడైనందున బాలల న్యాయస్థానంలో విచారణ జరగవలసి ఉందని, మిగిలిన ముగ్గురిపై ఉన్న కేసును కొట్టి వేసినట్లు ఏసుబాబు తెలిపారు.

కుటుంబ కలహాలు..భర్తపై భార్య దాడి

పాలకోడేరు, ఆగస్టు 13: కుటుంబ కలహాల నేపథ్యంలో భర్తపై భార్య దాడి చేసిన ఘటన వేంద్ర అగ్ర హారంలో జరిగింది. ఏఎస్సై మోహనరావు తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన కడలి మోహనరావు, లక్ష్మీ భార్యభర్తలు. వీరిద్దరూ కొంత కాలంగా గొడవలు పడుతున్నారు. సోమవారం చిన్న విషయంపై ఇద్దరి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. తీవ్ర కోపంతో భార్య ఇంట్లో ఉన్న కొడవలితో దాడి చేయడంతో భర్త మోహనరావుకు పలు చోట్ల గాయాలయ్యాయి. స్థానికులు అతడిని భీమవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన కారు

ఒకే కుటుంబంలో ముగ్గురి మృతి


లారీ కిందకు దూసుకెళ్లిన కారు




ప్రమాదంలో మృతి చెందిన నాగార్జున,మనోజ్, సుబ్రహ్మణ్యం (ఫైల్ ఫొటోలు)

దెందులూరు/దేవరపల్లి, ఆగస్టు 13 : జాతీయ రహదారిపై మంగళవారం జరిగిన ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి చెందారు. ఆగి ఉన్న లారీని వెనుక నుంచి కారులో వస్తూ ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు అక్కడిక్కడే మృతి చెందగా మరొకరు తీవ్రగాయాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. దెందులూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం దేవరపల్లి గ్రామానికి చెందిన దొమ్మేటి నాగార్జున, దొమ్మేటి మనోజ్ కుమార్, యాగంటి సుబ్రహ్మణ్యంలు విజయవాడ ఆసుపత్రికి వెళ్లారు. పని ముగించుకుని మంగళవారం కారులో వస్తుండగా దెందులూరు మండలం 16వ నెంబర్ జాతీయ రహదారి సత్యనారాయణపురం సమీపంలో ఆగి ఉన్న లారీని బలంగా వెనుక నుంచి ఢీ కొట్టడంతో కారు లారీ కిందకు వెళ్లిపోయింది. దీంతో కారులో ఉన్న నాగార్జున (35), సుబ్రహ్మణ్యం (55) అక్కడిక్కడే మృతి చెందగా మనోజ్ కుమార్‌కు తీవ్ర గాయాలవగా ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దెందులూరు పోలీసులు కేసు నమోదు చేశారు.

దేవరపల్లిలో విషాదఛాయలు

ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి చెందడంతో దేవరపల్లిలో విషాదఛాయలు నెలకొన్నాయి. దేవరపల్లి గ్రామానికి చెందిన దొమ్మేటి నాగార్జున జంగారెడ్డిగూడెం మండలం తిరుమలపురం గ్రామానికి చెందిన తన మేనమామ యాగంటి సుబ్రహ్మణ్యంకు అనారోగ్యంగా ఉండడంతో దేవరపల్లి నుంచి మంగళవారం ఉదయం విజయవాడ ఆసుపత్రికి వెళ్లి తిరిగి వస్తున్నారు. ఏలూరు జిల్లా దెందులూరు శివారు జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని కారు ఢీకొనడంతో నాగార్జున, సుబ్రహ్మణ్యం అక్కడికక్కడే మృతి చెందారు. నాగార్జున చిన్నాన్న కుమారుడు మనోజ్ (18)కు తీవ్ర గాయాలు కావడంతో ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. నాగార్జునకు భార్య, కుమార్తె ఉన్నారు. సుబ్రహ్మణ్యానికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మనోజ్ మొదటి సంవత్సరం ఇంజనీరింగ్ గుజరాత్‌లో చదువుతున్నాడు. రెండు రోజుల క్రితం తల్లిదండ్రులను చూడడానికి దేవరపల్లి వచ్చాడు. అతడికి తల్లిదండ్రులు, తమ్ముడు ఉన్నారు. ముగ్గురూ మృతి చెందటంతో కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు.

హత్య కేసులో ఇద్దరి అరెస్ట్

ఉండి ఆగస్టు 13: ఉండి గోరింతోటలో హత్యకు గురైన నల్లగంగుల నిఖిల్ కేసులో ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు ఆకివీడు రూరల్ సీఐ జగదీశ్వరరావు తెలిపారు. భీమవరం గునుపూడికి చెందిన నిఖిల్‌ను ఆదివారం రాత్రి ఉండి గోరింతోటలో హత్య చేసిన నేరంపై పాలకొల్లుకు చెందిన ముల్లం పవన్ కుమార్ (25), భీమవరానికి చెందిన కోతాడ మారేష్ (22) ఉండి బస్టాండ్‌లో వున్నట్లు సమాచారం రావడంతో అరెస్ట్ చేసి భీమవరం కోర్టుకు తరలించగా రిమాండ్ విధించిందని తణుకు సబ్‌జైలుకు తరలించినట్టు సీఐ జగదీశ్వరరావు తెలిపారు.

పాముకాటుతో మహిళా కూలీ మృతి



జంగారెడ్డిగూడెం, ఆగస్టు 13: పేరంపేట గ్రామానికి చెందిన ఎడ్లపల్లి వెంకాయమ్మ (38) పాముకాటుకు గురై మృతి చెందింది. వెంకాయమ్మ ఉదయం తోటి కూలీలతో కలసి డ్రిప్ పైపులు లాగేందుకు పనికి వెళ్లింది. పైపుల్లో ఉన్న తాచుపాము వెంకాయమ్మ ఎడమ చేతిపై కాటు వేసింది. అక్కడున్నవారు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్టు ఆమె భర్త దానియేలు చెప్పారు.టీడీపీ కార్యకర్త కావడంతో గ్రామ పార్టీ అధ్యక్షుడు గోలి వెంకటరెడ్డి, టీడీపీ నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

భర్త వేధింపులతో ఆత్మహత్య

మండవల్లి, ఆగస్టు 13 : భర్త వేధింపులతో మనస్థాపానికి గురై భార్య ఆత్మహత్య చేసు కున్న ఘటన మంగళవారం వెలుగులోకి వచ్చింది. మండవల్లి పోలీసుల వివరాల ప్రకారం మండవల్లి మండలం కానుకొల్లు గ్రామానికి చెందిన కోరసిక శ్రీనివాసరావు కుమార్తె సత్యవతి (24)కి, మాను కొండ గ్రామానికి చెందిన కుందేటి బాపయ్య కుమారుడు మణికంఠతో ఈ ఏడాది మార్చిలో ప్రేమ వివాహం జరిగింది.అయితే సత్యవతిని భర్త, అత్తమామలు రూ.5 లక్షలు కట్నంగా తేవాలని చిత్రహింసలకు గురి చేస్తుండడంతో గ్రామపెద్దల సమక్షంలో విడాకులు తీసుకోవడానికి ఒప్పుకొని సంతకాలు చేశారని, అయితే భర్త సత్యవతికి ఫోన్ చేసి 'నీ వీడియోలు, ఫోటోలు నా దగ్గర ఉన్నాయి, డైవర్స్ ఇచ్చి మళ్లీ ఎలా పెళ్లి చేసుకుంటావో చూస్తా'నని బెదిరించడంతో మన స్థాపానికి గురై ఈ నెల 9న ఎలుకల మందు తిని ఆత్మహత్యాయత్నం చేసింది. గుడివాడలోని ఆస్పత్రిలో చేర్చారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ 12వ తేదీ సాయంత్రం మరణించినట్లు పోలీసులు తెలిపారు. మండవల్లి ఎస్సై రామచంద్రరావు కేసు నమోదు చేయగా, ఏలూరు డీఎస్పీ శ్రావణ్‌కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

బుట్టాయగూడెం, ఆగస్టు 13 : మండల కేంద్రంలోని బుట్టాయగూడెం అంబేద్కర్ పేట సమీపంలో అంబేద్కర్ విగ్రహం వద్ద మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో బుట్టాయగూడేనికి చెందిన ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. బుట్టాయగూడెం కుమ్మరపేటకు చెందిన వమ్మిడివరపు నీలాసాయి, నీలం వీరబాబులు శివాలయం వైపు నుంచి బుట్టాయగూడెం ద్విచక్ర వాహనంపై వస్తుండగా బుట్టాయగూడెం నుంచి కన్నాపురం వెళుతున్న కారు వీరి వాహనాన్ని బలంగా ఢీకొంది. ప్రమాదంలో నీలాసాయి తలకు, కాళ్ళకు తీవ్ర గాయాలవగా వీరబాబు స్వల్పంగా గాయపడ్డాడు. ఇరువురిని 108లో బుట్టాయగూడెం సీహెచ్‌సికి తరలించి ప్రాథమిక వైద్యం అందించారు. మెరుగైన వైద్యం కోసం లీలాసాయిని జంగారెడ్డిగూడెం ఆసుపత్రికి తరలించారు. వీరిని ఢీకొన్న కారు ఆగకుండానే అతివేగంగా వెళ్ళిపోయి నందాపురం సమీపంలో ట్రాక్టరును ఢీకొట్టింది. వాహనంలో ఇద్దరు వ్యక్తులు ఉన్నట్లు సమాచారం. ప్రమాదానికి కారణమైన ఇద్దరూ మంగయ్యపాలెం వైసీపీ ఎంపీటీసీ కుమారులుగా పోలీసులు గుర్తించారు. కారును మంగయ్యపాలెం పొలాల్లో వదలి పారిపోయినట్లు పోలీసులు గుర్తించారు.

సారా తయారీ స్థావరంపై దాడి

ముసునూరు, ఆగస్టు 13: చెక్కపల్లి అడవిలో సారా తయారీ స్థావరంపై ముసునూరు పోలీసులు మంగళవారం దాడి చేసి తాళం మహేశ్వరరావును అదుపులోకి తీసుకున్నారు.మూడు లీటర్ల సారా, గ్యాస్ పొయ్యి, సిలిండర్, డ్రమ్ములు స్వాధీనం చేసుకున్నారు. 600 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పి.వాసు తెలిపారు.

సమస్యల పరిష్కారానికే ప్రాధాన్యం : ఎమ్మెల్యే చంటి


ప్రజావినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే చంటి

ఏలూరు టూ టౌన్, ఆగస్టు 13: ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రథమ ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. బడేటి క్యాంపు కార్యాలయంలో మంగళవారం ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి చంటి అధికారులతో మాట్లాడి దిశానిర్దేశం చేశారు. మాజీ డిప్యూటీ మేయర్ చోడే వెంకటరత్నం, మాజీ ఏఎంసీ చైర్మన్ పూజారి నిరంజన్, తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో విద్యార్థుల ప్రతిభ

ఏలూరు రూరల్, ఆగస్టు 13: మార్షల్ ఆర్ట్స్‌తో ఆత్మరక్షణతో పాటు శారీరక, మానసిక దృఢత్వం ఏర్పడుతుందని, ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. విజయవాడలో ఆదివారం జరిగిన మార్షల్ ఆర్ట్స్ జాతీయ స్థాయి, కుంగ్‌ఫూ, కరాటే చాంపియన్ షిప్ పోటీల్లో ఏలూరు, అక్షరా స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబర్చి పతకాలు సాధించారని, స్కూల్ చైర్మన్ సురేందర్, ప్రిన్సిపాల్ అర్చనా చౌదరి తెలిపారు. విజేతలు మంగళవారం ఎమ్మెల్యే బడేటి చంటిని మర్యాదపూర్వకంగా కలిసి ఆయన చేతులమీదుగా ట్రోఫీ, ప్రశంసాపత్రాలు అందుకున్నారు. కరాటే పోటీల్లో పలు విభాగాల్లో ఆర్.సత్యజ్ఞ, తేజేష్, పి.మోట్‌వెస్‌స్విమ్ ప్రథమ స్థానం, పి.డిసిత, ఎం.జాగృతి, ఎం.రితీష్ ద్వితీయ పతకాలు సాధించారు. శిక్షణ అందించిన మాస్టర్ వేణుగోపాల శ్రీనివాస్‌ను ఇన్‌స్ట్రక్టర్ పి.సాయికుమార్‌ను ఎమ్మెల్యే అభినందించారు.

జనసేన సభ్యత్వాలలో ప్రథమం : ఎమ్మెల్యే ధర్మరాజు



ఉంగుటూరు, ఆగస్టు 13 : కార్యకర్తల సంక్షేమం కోసం పవన్ కళ్యాణ్ చేపట్టిన క్రియాశీల సభ్యత్వాలు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో ఉంగుటూరు ప్రథమ స్థానంలో నిలిచిందని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు తెలిపారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. రాష్ట్రంలో ఏడో స్థానం కాగా ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో 19,011 మంది క్రియాశీల సభ్యులుగా నమోదయ్యారని వివరించారు. గతేడాది 8,300 సభ్యత్వం ఉన్న నియోజకవర్గాన్ని ప్రథమ స్థానంలో నిలిపిన కార్యకర్తలకు ఎమ్మెల్యే ధన్యవాదాలు తెలిపారు.

ఆక్వా, అగ్రికల్చర్‌కు అత్యధికంగా రుణాలు


సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

ఏలూరు రూరల్, ఆగస్టు 13: తమ బ్యాంకు ద్వారా ఆక్వా, అగ్రికల్చర్, పౌల్ట్రీ, రైస్‌మిల్లులకు అత్యధికంగా రుణాలు అందిస్తున్నట్లు సెంట్రల్ బ్యాంకు ఆఫ్ ఇండియా కార్పొరేట్ జనరల్ మేనేజరు ఏడీ శ్రీనివాస్ తెలిపారు. పవర్‌పేటలోని బ్యాంకు ఆవరణలో మేనేజరు మహీధర్ ఆధ్వర్యంలో మంగళవారం వినియోగదారులు, క్రెడిట్ క్యాంపు కార్యక్రమం నిర్వహించారు. అనంతరం విలేకర్ల సమావేశంలో శ్రీనివాస్ మాట్లాడుతూ ఏడు రీజియన్‌లలో 100కు పైగా బ్రాంచ్‌లు ఏర్పాటు చేసి ఎక్కువగా ఆక్వా, అగ్రికల్చర్, పౌల్ట్రీ, రైస్ మిల్లులకు రుణాలు ఇస్తున్నామన్నారు. త్వరలో రాష్ట్ర వ్యాప్తంగా మరో 25 శాఖలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఫీల్డ్ జనరల్ మేనేజరు దారాసింగ్‌నాయక్ మాట్లాడుతూ చిరువ్యాపారులకు జీఎస్టీ ఆధారంగా రుణాలు ఇస్తున్నామన్నారు. 28 రాష్ట్రాల్లో 4,608 శాఖలు ఉన్నాయని, వాటికి అనుసంధానంగా 16,644 ఏటీఎంలు, పది శాట్ లైట్ కార్యాలయాలు ఉన్నాయన్నారు. ప్రతిశాఖ నుంచి ప్రస్తుతం రూ.4.5 కోట్లు టర్నోవర్ జరుగుతుందని, దీన్ని మరింత పెంచేందుకు బ్యాంకు వినియోగదారులకు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. రీజనల్‌మేనేజరు సతీష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

డెంగీ, మలేరియా పై అవగాహన

టి.నరసాపురం, ఆగస్టు 13: సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో మండల వైద్యాధికారి జె.కల్పనారాణి ఆదేశాల మేరకు మండలంలోని బందంచెర్లలో పారిశుధ్యం, సీజనల్ వ్యాధులపైన అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు గ్రామ కమ్యూనిటి హెల్త్ ఆఫీసర్ ఆర్.ఝాన్సీ తెలిపారు. ప్రజలు దోమతెరలు వాడాలని, మురుగునీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, పొడవైన దుస్తులు ధరించాలని వారు సూచించారు. జ్వరం, తీవ్ర తలనొప్పి, దగ్గు, కీళ్ళ నొప్పులు ఉంటే వెంటనే వైద్య సిబ్బందిని సంప్రదించాలన్నారు. సచివాలయ సెక్రటరి రామకృష్ణ, ఏఎన్ఎం రాణి, ఆశ వర్కర్స్, మేరీ, ఉదయమణి పాల్గొన్నారు.

● లింగపాలెం : సీజనల్‌వ్యాధులపై నిర్లక్ష్యం వహించకూడదని, ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ యానిప్రీతి అన్నారు. ధర్మాజీగూడెంలో ఆమె వైద్య శిబిరం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఇళ్ళ వద్ద మురుగు నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. జ్వరం, తలనొప్పి లాంటివి వస్తే వెంటనే డాక్టర్‌ను సంప్రదించి సరైన చికిత్స తీసుకోవాలని తెలిపారు. వైద్యసిబ్బంది గ్రామాల్లో పర్యటించి ప్రతిరోజూ ఫీవర్‌సర్వే నిర్వహించాలని తెలిపారు. ఆమెతో పాటు పలువురు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

డ్రిప్‌తో తక్కువ నీటి వినియోగం

లింగపాలెం, ఆగస్టు 13 : డ్రిప్ ద్వారా నీటి ఆదాతో పాటు మొక్కకు సరిపడా నీరు అందుతుందని, నీటి ఎద్దడిలోనూ సరిపడా నీటిని అందించవచ్చని ఉద్యానవనశాఖ అధికారిణి షాఫియా పరిహీన్ తెలిపారు. లింగపాలెంలోని పామాయిల్ తోటలను మంగళవారం ఆమె పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ఉద్యానశాఖ ద్వారా డ్రిప్, స్ప్రింకర్లను రాయితీ పై రైతులకు ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు. మండలంలో రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు. డ్రిప్ పరికరాలు కావాల్సిన రైతులు పాస్‌బుక్, ఆధార్ కార్డు, బ్యాంకు అకౌంట్, పాస్ పోర్ట్ సైజు ఫొటోతో సమీప రైతుసేవా కేంద్రాల్లో వాటిని అందచేయాలని అన్నారు.

ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం

ఏలూరు టూ టౌన్, ఆగస్టు 13: ఆయూష్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. లంబాడిపేట నాల్గవ డివిజన్ అంగన్వాడీ సెంటర్‌లో సీనియర్ ఆయుర్వేద వైద్యాధికారి డాక్టర్ కె.లక్ష్మి రోగులను పరీక్షించారు. రక్తహీనత, ఎముకలు, కీళ్ళ నొప్పులు, రక్తభారం, సీజనల్ వ్యాధులకు మందులు అందజేశారు. విద్యార్థులకు పరిసరాల పరిశుభ్రత, ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ఆయుర్వేదం ప్రాముఖ్యత వివరించారు.

విద్యార్థులకు నేత్ర పరీక్షలు

కొయ్యలగూడెం, ఆగస్టు 13 : స్థానిక జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో మంగళవారం 370 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. వారిలో 48 మందికి దృష్టి లోపం ఉన్నట్లు గుర్తించి కళ్ళజోళ్ళ కోసం ప్రభుత్వానికి సిఫార్సు చేశామని నేత్ర వైద్యుడు సీహెచ్ చక్రవర్తి తెలిపారు. హెచ్ఎం, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

విధుల్లో చేరిన ఎంపీడీవోలు

ఉంగుటూరు, ఆగస్టు 13 : ఎంపీడీవోగా నందిపాటి ప్రేమాన్విత మంగళవారం విధుల్లో చేరారు. ఈమె కృష్ణా జిల్లా గూడూరు మండలం నుంచి బదిలీపై వచ్చారు.

● నిడమర్రు : ఎంపీడీవోగా జి.విజయ కుమారి స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో విధుల్లో చేరారు. ఆమె కృష్ణాజిల్లా విసన్నపేట నుంచి వచ్చారు.

● టి.నరసాపురం : ఎంపీడీవోగా బీఎస్ఎల్ మంగాకుమారి బాధ్యతలు చేపట్టారు. చాట్రాయి మండలం నుంచి బదిలీపై వచ్చారు.

సర్పంచ్‌లపై దురుసు ప్రవర్తన తగదు

పోలవరం, ఆగస్టు 13 : మండలంలో మంగళవారం జరిగిన శిక్షణ కార్యక్రమానికి ఎల్లండీపేట చెత్త నుంచి సంపద కేంద్రాల పరిశీలనకు సర్పంచులను, కార్యదర్శులను తీసుకువెళ్ళిన క్రమంలో సర్పంచులకు శిక్షణా భృతి ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని పట్టిసీమ సర్పంచ్ సబ్బారపు శ్రీరామ్మూర్తి ఎంపీడీవో శ్రీనుని కోరగా.. ఎంపీడీవో దురుసుగా మాట్లాడి హేళన చేశారు. అనంతరం ప్రగడపల్లి సచివాలయ ఆవరణలో ఉన్న చెత్త నుంచి సంపద కేంద్రం వద్ద మరోసారి అదే సర్పంచ్‌ని ఆమె చులకనగా మాట్లాడడంతో అక్కడే ఉన్న ప్రగడపల్లి గిరిజన సర్పంచ్ కలుం బాపిరాజు ఆమె దురుసు ప్రవర్తనపై అభ్యంతరం వ్యక్తం చేయడంతో అతనిపై కూడా ఆమె ఇష్టానుసారంగా దూషించి దురుసుగా ప్రవర్తించారు. తమను అవమానించిన ఎంపీడీవోపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని మండల సర్పంచులు కోరుతున్నారు. ఈ విషయంపై ఎంపీడీవోని వివరణ కోరగా ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు.

ఘనంగా మంగళ గౌరీ వ్రతాలు

ఏలూరు కార్పొరేషన్, ఆగస్టు 13 : శ్రావణమాసంలోని మంగళవారం కావడంతో నగరంలోని పలు డివిజన్లలో గల అమ్మవారి ఆలయాల వద్ద సామూహిక మంగళ గౌరీ వ్రతాలను మహిళలు నోచుకున్నారు.

ప్రతి ఇంటిపై జాతీయజెండా ఎగరాలి


విద్యార్థులతో ర్యాలీలో పాల్గొన్న సీనియర్ సిటిజన్స్ నాయకులు, అధ్యాపకులు

ఏలూరు రూరల్, ఆగస్టు 13: బీజేపీ పిలుపు మేరకు హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బానబాస్కర్‌రావు ఆధ్వర్యంలో సత్రంపాడు ఎమ్మార్పీ కాలనీలో ప్రతి ఇంటికి జాతీయ జెండాలు పంపిణీ చేశారు. త్రివర్ణ పతాకం తమ ఇళ్ల పై ఎగురవేయటం ద్వారా ప్రతిఒక్కరిలో జాతీయభావం పెంపొందుతుందన్నారు. కృష్ణారావు, పాలేటి రంగారావు, వి.వెంకటేశ్వరరావు, గణపతి పాల్గొన్నారు.

● ఉంగుటూరు : ప్రధాని మోదీ పిలుపు మేరకు పుర వీధులలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. సీనియర్ సిటిజన్స్ జాతీయ ఉపాధ్యక్షులు వెంపరాల నారాయణమూర్తి, సర్పంచ్ దిడ్ల అలకనంద, బీజేపీ నాయకులు ఎస్.మాలతీరాణి, ఎ.శోభారాణి, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బీవీ శ్రీనివాస్, చేబ్రోలు ఏఎస్ఐ కె.సాంబశివరావు, డిగ్రీ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో పోస్టల్ అధికారులు, సిబ్బంది ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజుకు జాతీయ జెండాను అందజేశారు. పోస్టల్ అధికారులు రామకృష్ణ, ఇనస్పెక్టర్ సుమన్, నిడమర్రు బ్రాంచి పోస్ట్ మాస్టర్ పి.ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు

● జంగారెడ్డిగూడెం : ప్రతీ ఇంట జాతీయ జెండా ఎగుర వేయాలనే ఉద్దేశ్యంతో హర్ ఘర్ తిరంగ నినాదంతో జంగారెడ్డిగూడెం డీఎస్పీ రవిచంద్ర జాతీయ జెండాను పోస్టల్ సిబ్బంది ద్వారా రూ.25 కే అందజేస్తున్నట్లు చెప్పారు. ఆయన స్థానిక హెడ్ పోస్టాఫీసు వద్ద మంగళవారం తపాలా అధికారి జి.గంగాధర్ ద్వారా జాతీయ జెండాను కొన్నారు. ఏఎస్పై సోంబాబు, పోస్టల్ సిబ్బంది రామాంజనేయులు, డి.వెంకట్, కె.వెంకట్, రాజేష్ ఉన్నారు.

ఆర్‌అండ్‌ఆర్ భూముల్లో అక్రమాలకు తావులేదు


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలరాజు, నాయకులు

జీలుగుమిల్లి, ఆగస్టు 13 : పోలవరం నిర్వాసిత భూముల్ని కొందరు తక్కువ కౌలు రూపంలో పొందేందుకు నిర్వాసితుల్ని పక్కదోవ పట్టిస్తున్నారని పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అన్నారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గడ్డమణుగు రవికుమార్ ఇంటి వద్ద మంగళవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. నియోజకవర్గంలో నిర్వాసిత భూములపై జరుగుతున్న అవినీతిపై తమ వద్ద ఆధారాలు ఉన్నాయన్నారు. గత ప్రభుత్వంలో కొందరు ముఠాలుగా మారి నిర్వాసిత భూముల్ని దోచుకున్నారన్నారు. అటువంటి వారిని గుర్తించి శాంతి భద్రతలకు ఇబ్బందులు కల్గకుండా కేసులు నమోదు చేయిస్తామన్నారు. మండల పార్టీ అధ్యక్షులు పసుపులేటి రాము, నాయకులు అడప నాగరాజు, చిర్రి శ్రీను, కోలా మధు ఉన్నారు.

బిస్కెట్ల తయారీని పరిశీలించిన ఎమ్మెల్యే బాలరాజు

బుట్టాయగూడెం : కేఆర్ పురం ఐటీడీఏ వద్ద గిరిజన మహిళలు నడుపుతున్న బిస్కెట్ల తయారీ పరిశ్రమను మంగళవారం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు సందర్శిం చారు. సహజ సిద్ధంగా పండించిన అపరాలతో తయారు చేసిన బిస్కెట్లను పరిశీ లించిన ఆయన ప్రభుత్వం ఇస్తున్న చిక్కికి బదులు వీటిని పిల్లలకు ఇస్తే ఆరోగ్యం గా ఉంటారని తెలిపారు. ఈ పరిశ్రమ ద్వారా కొంతమందికి ఉపాధి ఉంటుందని ఇదే విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళతానన్నారు. కుటీరి పరిశ్రమ ఉన్న భవనం వర్షానికి నీరుకారుతుందని ఇబ్బందులు పడుతున్నామని నిర్వాహకులు చెప్పడంతో మరమ్మతులు చేయాలని అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. డీవైఈవో నీలయ్య, మేనేజర్ ప్రకాష్, జనసేన నాయకులు పాదం కృష్ణ, బుచ్చిరాజు పాల్గొన్నారు.

తక్కువ ఖర్చుతో నాణ్యమైన దిగుబడులు


నిడమర్రు మండలం అడవికొలనులో నిర్వహించిన పొలంబడి

నిడమర్రు ఆగస్టు 13 : మేలైన యాజమాన్య పద్ధతుల ద్వారా వ్యవసా యం లాభసాటిగా చేయవచ్చని మండల వ్యవ సాయ శాఖాధికారిణి జి.గీతాదేవి అన్నారు. అడవికొలనులో మంగళవారం జీఏపీ పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ శాఖ సిబ్బంది రైతులకు పొలంబడి ఆవశ్యకతను వివరిస్తూ ఎరువుల వాకడం, క్రిమ సంహరక మందు లు వాడకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. సర్పంచ్ పాలా వెంకటేశ్వరరావు, కిసాన్ సంఘ్ జిల్లా కన్వీనర్ పైడికొండల శివాజీ, వ్యవసాయ శాఖ సిబ్బంది హనుమంతు, రవికుమార్, సాయిప్రసాద్, శ్రావణి, శ్రీలక్ష్మీ, రైతులు పాల్గొన్నారు.

పాలకుంటలో పొలంబడి

బుట్టాయగూడెం : పాలకుంటలో మంగళవారం ఏవో డి.ముత్యాలరావు పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. మేలైన వ్యవసాయ పద్ధతులు పాటిస్తూ తక్కువ ఖర్చుతో నాణ్యమైన అధిక దిగుబడులు సాధించ డానికి పొలంబడి కార్యక్రమం రైతులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. అవసరం మేరకు మాత్రమే రసాయనిక ఎరువులు, పురుగు మందులు వాడాలని సూచించారు. ప్రకృతిలో లభ్యమయ్యే కషాయాలతో చీడపీడల నివారణ చేపట్టవచ్చని తెలిపారు. మిత్ర పురుగుల సంరక్షణ, శత్రు పురుగుల నివారణ ఆరోగ్యవంతమైన పంట సాగు చేయడం ద్వారా రైతు ఖర్చు తగ్గించు కోవచ్చని తెలిపారు. రసాయనిక ఎరువుల వినియోగం వలన ఖర్చు పెరుగుతుందని తెలిపారు. పురుగుమందులు పిచికారీ చేసే సమయంలో కనీస జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వ్యవసాయ సహాయకులు, పీపీఏలు గ్రూపు సభ్యులు రైతులు పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు


రుద్రకోటరాజుగూడెంలో బ్లీచింగ్ చల్లుతున్న సిబ్బంది

టి.నరసాపురం, ఆగస్టు 13: మండలంలోని రుద్రకోటరాజుగూడెంలో డెంగీ జ్వరాలు ప్రబలడంతో ఈవోపీఆర్డీ రాంప్రసాద్ ఆదేశాల మేరకు పంచాయతీ కార్యదర్శి జి.లక్ష్మీనారాయణ సిబ్బందితో దోమల నివారణకు మంగళవారం చర్యలు చేపట్టారు. వీధుల్లో చెత్తా,చెదారం తొలగించి బ్లీచింగ్ చల్లించి దోమలు మందు పిచికారీ చేయించారు.

● ఏలూరు టూ టౌన్ : సీజనల్ వ్యాధులు ప్రబలకుండా దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఎంహెచ్ఓ డాక్టర్ మాలతి తెలిపారు. స్టాప్ డయేరియా కార్యక్రమంలో భాగంగా మంగళవారం 15వ డివిజన్‌లో పారిశుధ్య పనులు చేపట్టారు. ప్రశాంత్‌నగర్, జాలా పరమేశ్వర కాలనీ, గాయిత్రీనగర్ ప్రాంతాల్లో దోమల లార్వా నిర్మూలనకు స్ప్రేయింగ్, మురుగుకాల్వల కల్వర్టుల కింద ఫాగింగ్, ఖాళీస్థలాల్లో నిల్వ ఉన్న నీటిలో ఆయిల్‌బాల్స్ వేశారు. మలేరియా ఇన్‌స్పెక్టర్ వేణుగోపాలస్వామి, మేస్త్రీ డి.దుర్గారావు, శ్రీనివాసరావు, ఆరోగ్య కార్యదర్శి, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

సాగుదారులకు పట్టాలు ఇవ్వాలి

టి.నరసాపురం, ఆగస్టు 13: మండలంలోని అల్లంచర్లరాజుపాలెంలో దశాబ్దాలుగా సాగు చేసుకుంటున్న భూములకు కోనేరు రంగారావు భూ కమిషన్ సిఫార్సులు అనుసరించి పేదలకు పట్టాలు ఇచ్చి యాజమాన్య హక్కు కల్పించాలని సీపీఐ, ఏలూరు జిల్లా కౌన్సిల్ సభ్యుడు టీవీఎస్ రాజు మంగళవారం ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తాము అధికారంలోకి వస్తే పేదల సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలి ఇప్పిస్తామని ఇల్లులేని పేదలు అందరికి గత ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు కాలేదన్నారు. పేదల పై కక్ష సాధింపు చర్యలకు పాల్పడితే ఎర్రజెండాలతో భూముల్లోకి ప్రవేశించి పేదలకు భూములు పంపిణీ చేస్తామని స్పష్టం చేశారు.

మైనర్లకు వాహనాలు ఇవ్వకండి


విద్యార్థి తల్లిదండ్రులతో ఫోన్‌లో మాట్లాడుతున్న ఎస్ఐ సాధిక్

ఏలూరు క్రైం, ఆగస్టు 13 : పిల్లలపై ఉన్న ప్రేమతో ద్విచక్ర వాహనాలు కొనడం వల్ల వారు ప్రమాదాలకు గురైతే వారితో పాటు ఎదుటివారికి కూడా తీరని నష్టం వాటిల్లుతుందని ఈ విషయం తల్లి దండ్రులు గమనించాలని ఏలూరు టూ టౌన్ ఎస్ఐ సాధిక్ అన్నారు. జిల్లా ఎస్పీ కేపీఎస్ కిశోర్ ఆదేశాల మేరకు ఏలూరు డీఎస్పీ శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం నగరంలో వాహనాల తనిఖీలు చేపట్టారు. పలువురు విద్యార్థులు, మైనర్లు మోటారు సైకిళ్ళను నడుపుకుంటూ రావడంతో వారిని ఆపి వారి తల్లి దండ్రులతో ఎస్ఐ ఫోన్ చేసి మాట్లాడారు. మైనర్లు డ్రైవింగ్ లైసెన్సు లేకుండా వాహనం నడిపితే రూ.25 వేలు జరిమానాతోపాటు వాహన యజమానిపై కూడా కేసు నమోదు చేసి వాహనాన్ని సీజ్ చేస్తామని ఆయన హెచ్చరించారు.

మత్తు పదార్థాలకు బానిసలు కాకండి

జంగారెడ్డిగూడెం, ఆగస్టు 13 : విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిసలు కావద్దని జంగారెడ్డిగూడెం సీఐ పి.రాజేష్ అన్నారు. ప్రభుత్వ కళాశాల విద్యార్థులకు మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలను భవిష్యత్తులో దాని ప్రభావంతో కలిగే నష్టాల్ని మంగళవారం వివరించారు. స్థానిక బోసు బొమ్మ సెంటర్ వరకు విద్యార్థుల ర్యాలీలో పాల్గొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

దాసాంజనేయుని సన్నిధిలో ఎంపీ

ఏలూరు కార్పొరేషన్, ఆగస్టు 13 : శ్రావణ మంగళవారం కావడంతో నరసింహా రావుపేటలోని దాసాంజనేయస్వామిని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ దర్శించుకున్నారు. స్వామివారికి తమలపాకులు, సింధూరంతో అర్చనలు జరిపారు. ప్రత్యేక హారతులు ఇచ్చి ఆరాధించారు.

అన్న సమారాధన

పెదపాడు, ఆగస్టు 13 : అప్పనవీడులో ప్రసిద్ధి చెందిన అభయాంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో మంగళవారం దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఊయల అందజేత



ఉంగుటూరు, ఆగస్టు 13 : కైకరం లోని శ్రీవల్లీ దేవసేన సహిత శ్రీసుబ్ర హ్మణ్య స్వామికి శ్రావణ మంగళవారం కావడంతో భక్తులు విశేష పూజలు నిర్వహించారు. అనంతరం భక్తుల సహకారంతో అన్న సమారాధన నిర్వహించారు. గ్రామానికి చెందిన వై.రామదాసు, ఆయన కుమారుడు రామన్న రూ.10 వేలు విలువ చేసే చెక్కతో తయారు చేయించిన ఊయల అందజేశారు. ఆలయ కమిటీ తరఫున పామర్తి సత్యనారాయణ (సత్తిబాబు), దాతలు హాజరయ్యారు.

గ్రామ పరిపాలనపై సర్పంచ్‌లకు శిక్షణ


చింతలపూడిలో తడిచెత్తను సర్పంచ్‌లకు చూపిస్తున్న కార్యదర్శి

ఏలూరు రూరల్, ఆగస్టు 13: గ్రామ పరిపాలన, పారిశుధ్యం వంటి ప్రధానాంశాలపై ఏలూరు రూరల్ మండలం, మల్కాపురం పంచాయతీ కార్యాలయంలో ఈవోపీఆర్డీ సరళకుమారి ఆధ్వర్యంలో శిక్షణ నిర్వహించారు. మండలంలోని 14 పంచాయతీ సర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు. రెండో రోజు కార్యక్రమంలో భాగంగా చెత్త నుంచి సంపద కేంద్రాల క్షేత్ర సందర్శన నిర్వహించారు. ఇతర పాలనాంశాలపై అవగాహన కల్పించారు. చివరి రోజు బుధవారం పరిపాలన అంశాల పై ఏలూరు మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణ జరుగుతుందని ఎంపీడీవో బండి ప్రణవి తెలిపారు.

● కామవరపుకోట : స్థానిక మండల పరిషత్ ఆధ్వర్యంలో చెత్త సంపద తయారీ కేంద్రం షెడ్డు వద్ద మండలంలోని సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు పరిపాలన విధానంపై ఎంపిడిఓ జంగం స్వర్ణభారతి జంగం స్వర్ణభారతి శిక్షణను నిర్వహించారు. మాస్టర్ ఆఫ్ ట్రైనీస్ జీడీవీ శ్రీనివాసరావు, నేతల విజయ్ మంచినీటి సౌకర్యాలు, పారిశుధ్యం, గ్రామంలో తీసుకోవాల్సిన చర్యలు, తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. గ్రామాల్లో అవలంబించాల్సిన పద్ధతులు, పారిశుధ్యాన్ని మెరుగుపరిచేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు.

● చింతలపూడి: మండలంలో సర్పంచ్‌లకు, కార్యదర్శులకు రెండో రోజు శిక్షణా కార్యక్రమంలో ఫీల్డ్ విజిట్ నిర్వహించారు. యర్రగుంటపల్లి పంచాయతీలో అమలు జరుగుతున్న సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ పథకంపై శిక్షణ ఇచ్చారు. గ్రామపంచాయతీల్లో చెత్తసేకరణ జరిపి దానిని తడి, పొడిచెత్తగా విడదీసి, తడిచెత్తను ఎరువుగాను, పొడిచెత్తను శ్క్రాప్‌గాను విక్రయించటం, వీటి ప్రాసెసింగ్ పై అమలు జరుపుతున్న పనులను సర్పంచ్‌లకు, కార్యదర్శులకు వివరించారు. తొట్టెల్లో తడిచెత్తను నింపి ఎరువుగా ఏ విధంగా మార్చాలి, దాన్ని ఎలా విక్రయించాలి అనేది కూడా శిక్షణలో తెలిపారు. శిక్షణ ఇచ్చిన కార్యదర్శులు రామ్మోహన్, కుమారస్వామి, మురళీకృష్ణ, లక్ష్మి తదితరులు ఉన్నారు.

● ఉంగుటూరు : చెత్త నుంచి సంపద ద్వారా ఆదాయం సమకూర్చుకోవాలని ఇన్‌చార్జి ఎంపీడీవో హనుమ సూచించారు. మండలంలోని సర్పంచ్‌లు, కార్యదర్శులు ఉంగుటూరులోని చెత్త నుంచి సంపద కేంద్రాన్ని సందర్శించి సర్పంచులు స్వచ్ఛ భారత్‌పై ర్యాలీ నిర్వహించారు. పారిశుధ్య నిర్వహణతో పాటు తడి, పొడి చెత్త వేరు చేయడంపై అవగాహన కల్పించారు. కొబ్బరి మొక్క నాటారు. ఆయా గ్రామాల సర్పంచ్‌లు, కూటమి నాయకులు పాతూరి విజయకుమార్, ఈవోపీఆర్డీ కాకర్ల వెంకట గిరిధర్ పాల్గొన్నారు.

● పోలవరం :మండల ప్రజాపరిషత్ అధికారి జి.శ్రీను ఆధ్వర్యంలో సర్పంచులు, కార్యదర్శుల శిక్షణ కార్యక్రమం రెండో రోజు కొనసాగింది. ఈ శిక్షణ కార్యక్రమంలో భాగంగా ఎల్లండీపేట, ప్రగడపల్లి సచివాలయ ఆవరణలో ఉన్న చెత్త నుంచి సంపద కేంద్రాలను పరిశీలించారు.

రేపు మాంసం దుకాణాల బంద్

పోలవరం, ఆగస్టు 13 : భారత దేశ 78వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఈ నెల 15వ తేదీ మండలంలో మాంసం దుకాణాలు, చేపల వ్యాపారాలు, చికెన్ షాపులు మూసి వేయాలని పంచాయతీల కార్యదర్శులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మాంసం, చేపల వ్యాపారులకు ముందస్తుగా సమాచారం అందించారు. అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలవరం, గూటాల, ఎల్లండీపేట పంచాయతీ కార్యదర్శులు వై.కొండలరావు, తాతి విజయకుమారి, పి.అప్పారావు పాల్గొన్నారు.

20 నుంచి భూ సమస్యలపై రెవెన్యూ గ్రామ సభలు

పోలవరం, ఆగస్టు 13 : మండలంలో భూ సమస్యలపై ఈ నెల 20 నుంచి సెప్టెంబరు 20 వరకూ నెలరోజుల పాటు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామని తహసీల్దారు సాయిరాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ భూ సంబంధిత సమస్యలు పరిష్కరించు కోవాలని కోరారు. ఈ గ్రామ సభలలో మండల ప్రజాపరిషత్ అధికారి, రెవెన్యూ ఇనస్పెక్టర్, వీఆర్వోలు, సర్వేయర్లు, అటవీ శాఖ అధికారులు, రిజిస్ట్రేషన్ అధికారులు, దేవాదాయ శాఖ అధికారులు, వక్ఫ్ బోర్డు అధికారులు పాల్గొంటారని తెలిపారు. ఈ గ్రామ సభలు ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకూ జరుగుతాయన్నారు. ఈ నెల 20న గూటాల సచివాలయం , 24న ఎల్లండీపేట రైతు భరోసా కేంద్రం, 27న పట్టిసీమ సచివాలయం, 29న నాగంపాలెం కమ్యూనిటీ హాలు, 31న సరిపల్లికుంట అంగన్వాడీ సెంటర్, సెప్టెంబరు 3న ప్రగడపల్లి సచివాలయం , 5న పోలవరం గ్రామ సచివాలయం, 10న వింజరం సచివాలయం, 12న చేగొండపల్లి సచివాలయం, 13న గెడ్డపల్లి సచివాలయం, 17న ధార్వాడ అంగన్వాడీ కేంద్రం, 20 చిలకలూరు అంగన్వాడీ కేంద్రాల్లో గ్రామ సభ లు నిర్వహిస్తున్నామని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగపరుచుకొని భూ సంబంధిత సమస్యలు పరిష్కరించుకోవాలని సూచించారు.

జాబ్ మేళాలో 24 మంది ఎంపిక

ఏలూరు కార్పొరేషన్, ఆగస్టు 13 : సెట్‌వెల్ కార్యాలయం వద్ద మంగళవారం నిర్వహిం చిన జాబ్ మేళాకు 65 మంది హాజరుకాగా వారిలో 24 మందిని ఎంపిక చేసినట్టు ఉపాధి కల్పన అధికారి మధుభూషణరావు తెలిపారు. జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం, నేషనల్ కెరీర్ సెంటర్, ఏపీ ప్రభుత్వ యువజన సర్వీసుల శాఖ సెట్‌వెల్ ఆధ్వర్యంలో ఈ జాబ్‌మేళాలో నేషనల్ కెరీర్ సర్వీస్ జిల్లా కో ఆర్డినేటర్ జి.ప్రవీణ్‌కృష్ణ, జిల్లా స్కిల్ డవలప్‌మెంట్ అధికారి ఘంటా సుధాకర్, సెట్‌వెల్ మేనేజర్ పీవీఎస్ సత్యనారాయణ, పర్యవేక్షకులు కేజే కెనడీ, పసుపులేటి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మండలంలో ఓ మోస్తరు వర్షం

పోలవరం ఆగస్టు 13 : మండ లంలో మంగళవారం ఓ మోస్తరు వర్షం కురిసింది. గూటాల , కొత్త పట్టిసీమ, పోలవరం, పట్టిసీమ పంచా యతీలలో ఏటి గట్టుకి కుడి వైపున గట్టు వెంబడి ఉన్న నివాసాల చుట్టూ వర్షపు నీరు చేరింది. పది రోజులుగా ఆయా ప్రాంతాలలో ఉన్న వర్షపు నీటి ని సర్పంచులు కార్యదర్శులు మోటా ర్లతో తోడిస్తున్నారు. పలుచోట్ల సూపర్ శానిటైజేషన్ చేసి బ్లీచింగ్ చల్లించారు. చల్లించిన బ్లీచింగ్ వర్షం ప్రభావానికి కొట్టుకుపోయింది. మరో రెండు రోజుల్లో వర్షపు నీరు పూర్తి స్థాయిలో తొలగిపోయే పరిస్థితుల్లో మళ్ళీ వర్షం రావడంతో పరిస్థితి యథాస్థితికి చేరుకుంది. అధికారులు స్పందించి శాశ్వత పరిష్కారం జరిగేలా అన్ని ప్రాంతాల్లో డ్రైనేజీ వ్యవస్థలు ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

వితంతు పింఛన్‌లో సమస్యలుంటే తెలపండి


మాట్లాడుతున్న జడ్జి రత్న ప్రసాద్

ఏలూరు క్రైం, ఆగస్టు 13 : వితంతు పింఛన్ పొందడంలో సమస్యలుంటే జిల్లా న్యాయసేవాధికార సంస్థను సంప్రదించాలని ఆ సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.రత్న ప్రసాద్ అన్నారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి సీహెచ్ పురుషోత్తమ కుమార్ ఆదేశాల మేరకు ఏలూరు జిల్లా కోర్టు ఆవరణలోని లోక్ అదాలత్ భవనంలో మంగళవారం మహిళలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి రత్న ప్రసాద్ మాట్లా డుతూ సెప్టెంబర్ 14వ తేదీన జిల్లా వ్యాప్తంగా జాతీయ లోక్‌అదాలత్ నిర్వహి స్తున్నారని ఎవరికైనా సివిల్, రాజీయోగ్యమైన క్రిమినల్ కేసులను పరిష్కరిం చుకోవడానికి సంబంధిత కోర్టులను సంప్రదించాలని సూచించారు. పెన్షన్ ప్రాజెక్టు ఆఫీసర్ కృష్ణమూర్తి, ప్యానల్ లాయర్లు కూనా కృష్ణారావు పాల్గొన్నారు.

నామినేటెడ్ పోస్టుల్లో రజకులకు ప్రాధాన్యం ఇవ్వాలి

ఏలూరు రూరల్, ఆగస్టు 13: రజకులకు కూటమి ప్రభుత్వం సామాజిక, ఆర్థిక, రాజకీయపరంగా ప్రాధాన్యత ఇవ్వాలని, జిల్లా రజక జన సంఘ అధ్యక్షుడు చిలకలపల్లి కట్లయ్య కోరారు. నామినేటెడ్ పోస్టుల్లో అర్హులకు ప్రాధాన్యత ఇవ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. జిల్లా రజక జన సంఘ కార్యాలయంలో మంగళవారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలు తీర్మానాలు చేశారు. కట్లయ్య మాట్లాడుతూ మెట్ట ప్రాంతంలో ఎంతో కాలంగా పార్టీకి సేవచేస్తున్న వ్యక్తులకు కూటమి ప్రభుత్వం న్యాయం చేస్తుందని ఆశా భావం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో దోబీ ఘాట్స్‌కు వచ్చిన నిధులు మంజూరైనా ప్రభుత్వం వెనక్కి తీసుకోవడం దురదృష్టకరమన్నారు. పి.సాంబశివరావు, శ్రీనివాస్, కె.మురళీ, దుర్గారావు, సుబ్రహ్మణ్యం, సుబ్బయ్య పాల్గొన్నారు.

గిరిజనుడి వైద్యానికి ఆర్థిక సాయం

బుట్టాయగూడెం, ఆగస్టు 13 : బ్రెయిన్ స్ట్రోక్‌తో ఏలూరు ఆశ్రం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మండలంలోని కోర్సవారిగూడెంకు చెందిన పూనెం మల్లేశ్వరావు వైద్యానికి విద్యారోహిణి విద్యా సంస్థల ప్రిన్సిపాల్ కొండేపాటి రామకృష్ణ రూ. ఐదు వేలను అందజేశారు. మల్లేశ్వరావు వైద్యం కోసం లక్షల్లో ఖర్చు అవుతుందని వైద్యులు చెప్పడంతో భార్య మండలంలో పెద్దలకు తెలపగా వారు దాతల సాయాన్ని కోరారు. దీనిపై స్పందించిన పండుగూడెం గ్రామస్తులు రూ.20,200లు, వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో కంచర్ల రామ్మోహన్‌రావు చేతుల మీదుగా రూ. ఐదు వేల సాయాన్ని గిరిజన నాయకులకు అందజేశారు. ప్రభుత్వం చొరవతీసుకుని ఐటీడీఏ ద్వారా మల్లేశ్వరావుకు మెరుగైన వైద్యం అందించాలని భార్య, గిరిజన సంఘాల నాయకులు కోరుతున్నారు.

కులాన్ని రెచ్చగొట్టే విధంగా మాట్లాడటం తగదు


దాసరి శ్యామ్‌చంద్ర

ఏలూరు టూ టౌన్, ఆగస్టు 13: అగ్రిగోల్డ్ కేసులో భూములను తన కొడుకు పేర రిజిస్టర్ చేయించుకుని అరెస్టు అయితే కులాన్ని రెచ్చగొట్టే విధంగా మాజీ మంత్రి జోగి రమేష్ మాట్లాడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అఖిల భారత గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ దాసరి శ్యామ్ చంద్రశేషు అన్నారు. 2019 ఎన్నికలకు ముందు అగ్రిగోల్డ్ బాధితుల పక్షాన నిలబడతామని వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చిన తరువాత ఏకంగా ఆ భూముల్నే కాజేసిన ఘనత జోగి రమేష్‌దన్నారు. అగ్రిగోల్డ్ భూములే కాకుండా రాష్ట్రంలో ఎన్నో భూముల్ని రికార్డులు మార్చేసి కబ్జా చేశారన్నారు.

వెయ్యి అడుగుల జాతీయ జెండా ప్రదర్శన



కొయ్యలగూడెం, ఆగస్టు 13: అజాదిక అమృత్ మహోత్సవ్‌లో భాగంగా మంగళవారం వెయ్యి అడుగుల జాతీ య జెండాతో వివిధ పార్టీల నాయకులు, సంఘాలు, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. బీజేపీ మహిళా మోర్చ రాష్ట్ర అధ్యక్షురాలు బి.నిర్మల, మండల అధ్యక్షుడు బి.బాబు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ మోసం.. కేసు నమోదు

ఏలూరు క్రైం, ఆగస్టు 13: స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని కొన్ని టాస్కులు నిర్వహిస్తున్నామని ఒక ఆన్‌లైన్ లింకు ఫోన్‌కి రావడంతో దానిని ఓపెన్ చేసిన ఒక యువకుడు మోసానికి గురయ్యాడు. ఏలూరు కొత్తపేటకు చెందిన యాసపు ప్రదీప్ కుమార్ తనకు ఆన్‌లైన్‌లో వచ్చిన లింకును ఓపెన్ చేశాడు. స్వాతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని టాస్కులు నిర్వహిస్తున్నామని వీటిలో గెలుపొందిన వారికి అత్యధిక నగదు బహుమతులు ఇస్తున్నామంటూ నమ్మబలికి టాస్కులు పెట్టారు. దఫదఫాలుగా మొత్తం రూ.ఎనిమిది లక్షలను ప్రదీప్ కుమార్ నుంచి కాజేశారు. ఇది మోసమని తెలుసుకొని మంగళవారం రాత్రి ఏలూరు టూ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు ఆన్‌లైన్ లింకుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఏలూరు టూ టౌన్ సీఐగా రమణ

ఏలూరు టూ టౌన్ లా అండ్ ఆర్డర్ పోలీస్ స్టేషన్ ఇనస్పెక్టర్ వేవీ రమణను నియమిస్తూ ఏలూరు రేంజ్ ఐజి జీవీజీ అశోక్ కుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈయన గతంలో ఏలూరు ట్రాఫిక్ సీఐగా పని చేశారు. ప్రస్తుతం మచిలీపట్నం ట్రాఫిక్ సీఐగా పని చేస్తున్న రమణను ఏలూరు టూ టౌన్ సీఐగా నియమించారు శుక్రవారం ఆయన బాధ్యతలు చేపట్టనున్నారు.

ఎస్బీఐ ఏటీఎంకు మోక్షం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

చాట్రాయి, ఆగస్టు 13: చాట్రాయిలో 40 రోజులుగా పనిచేయని ఎస్బీఐ ఏటీఎంకు మోక్షం లభించింది. 'నెల రోజులుగా పనిచేయని ఏటీఎం' శీర్షికన ఆగస్టు 3న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి ఎస్బీఐ ఉన్నతాధికారులు స్పందించారు. మంగళవారం కొత్త ఏటీఎం మిషన్‌ను బిగిస్తున్నారు. ఏటీఎం సేవలు అందుబాటులోకి తెస్తామని ఖాతాదారులు, ప్రజలు వినియోగించుకోవాలని బీఎం కిరణ్‌కుమార్, అకౌంటెంట్ భాగ్యారావు విజ్ఞప్తి చేశారు.



కొత్త ఏటీఎం బిగిస్తున్న దృశ్యం

ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన కారు

ఒకే కుటుంబంలో ముగ్గురి మృతి



దెందులూరు/దేవరపల్లి, ఆగస్టు 13 : జాతీయ రహదారిపై మంగళవారం జరిగిన ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి చెందారు. ఆగి ఉన్న లారీని వెనుక నుంచి కారులో వస్తూ ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందగా మరొకరు తీవ్రగాయాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. దెందులూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం దేవరపల్లి గ్రామానికి చెందిన దొమ్మేటి నాగార్జున, దొమ్మేటి మనోజ్ కుమార్, యాగంటి సుబ్రహ్మణ్యంలు విజయ వాడ ఆసుపత్రికి వెళ్లారు. పని ముగించుకుని మంగళవారం కారులో వస్తుండగా దెందులూరు మండలం 16వ నెంబర్ జాతీయ రహదారి సత్యనారాయణపురం సమీపంలో ఆగి ఉన్న లారీని బలంగా వెనుక నుంచి ఢీ కొట్టడంతో కారు లారీ కిందకు వెళ్లిపోయింది. దీంతో కారులో ఉన్న నాగర్జున (35), సుబ్రహ్మణ్యం (55) అక్కడికక్కడే మృతి చెందగా మనోజ్ కుమార్‌కు తీవ్ర గాయాలవగా ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దెందులూరు పోలీసులు కేసు నమోదు చేశారు.





ప్రమాదంలో మృతి చెందిన నాగార్జున,మనోజ్, సుబ్రహ్మణ్యం (ఫైల్ ఫొటోలు)

దేవరపల్లిలో విషాదఛాయలు

ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి చెందడంతో దేవరపల్లిలో విషాదఛాయలు నెలకొన్నాయి. దేవరపల్లి గ్రామానికి చెందిన దొమ్మేటి నాగార్జున జంగారెడ్డిగూడెం మండలం తిరుమలపురం గ్రామానికి చెందిన తన మేనమామ యాగంటి సుబ్రహ్మణ్యంకు అనారోగ్యంగా ఉండడంతో దేవరపల్లి నుంచి మంగళవారం ఉదయం విజయవాడ ఆసుపత్రికి వెళ్లి తిరిగి వస్తున్నారు. ఏలూరు జిల్లా దెందులూరు శివారు జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని కారు ఢీకొనడంతో నాగార్జున, సుబ్రహ్మణ్యం అక్కడికక్కడే మృతి చెందారు. నాగార్జున చిన్నాన్న కుమారుడు మనోజ్ (18)కు తీవ్ర గాయాలు కావడంతో ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. నాగార్జునకు భార్య, కుమార్తె ఉన్నారు. సుబ్రహ్మణ్యానికి భార్య ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మనోజ్ మొదటి సంవత్సరం ఇంజనీరింగ్ గుజరాత్‌లో చదువుతున్నాడు. రెండు రోజుల క్రితం తల్లిదండ్రులను చూడడానికి దేవరపల్లి వచ్చాడు. అతడికి తల్లిదండ్రులు, తమ్ముడు ఉన్నారు. ముగ్గురూ మృతి చెందటంతో కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు.

భర్త వేధింపులతో ఆత్మహత్య

మండవల్లి, ఆగస్టు 13 : భర్త వేధింపులతో మనస్థాపానికి గురై భార్య ఆత్మహత్య చేసుకున్న ఘటన మంగళవారం వెలుగులోకి వచ్చింది. మండవల్లి పోలీసుల వివరాల ప్రకారం మండవల్లి మండలం కానుకొల్లు గ్రామానికి చెందిన కోరసిక శ్రీనివాసరావు కుమార్తె సత్యవతి(24)కి, మానుకొండ గ్రామానికి చెందిన కుందేటి బాపయ్య కుమారుడు మణికంఠతో ఈ ఏడాది మార్చిలో ప్రేమ వివాహం జరిగింది. అయితే సత్యవతిని భర్త, అత్తమామలు రూ.5 లక్షలు కట్నంగా తేవాలని చిత్రహింసలకు గురిచేస్తుండడంతో గ్రామపెద్దల సమక్షంలో మ్యూచువల్ డైవర్స్ తీసుకోవడానికి ఒప్పుకొని సంతకాలు చేశారని, అయితే భర్త సత్యవతికి ఫోన్ చేసి 'నీ వీడియోలు, ఫోటోలు నా దగ్గర ఉన్నాయి, డైవర్స్ ఇచ్చి మళ్లీ ఎలా పెళ్లి చేసుకుంటావో చూస్తా'నని బెదిరించడంతో మనస్థాపానికి గురై ఈ నెల 9న ఎలుకల మందు తిని ఆత్మహత్యాయత్నం చేసింది. గమనించిన గ్రామస్థులు గుడివాడలోని ఆస్పత్రిలో చేర్చారు. సత్యవతి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పోలీసులకు ఫిర్యాదు చేసింది. అయితే సత్యవతి చికిత్స పొందుతూ 12వ తేదీ సాయంత్రం మరణించినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు మండవల్లి ఎస్సై సీహెచ్ రామచంద్రరావు కేసు నమోదు చేయగా, ఏలూరు డీఎస్పీ డి. శ్రావణ్‌కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.



సత్యవతి మృతదేహం

సారా తయారీ స్థావరంపై దాడి..

ముసునూరు, ఆగస్టు 13: చెక్కపల్లి అడవిలో సారా తయారీ స్థావరంపై ముసునూరు పోలీసులు మంగళవారం దాడి చేసి తాళం మహేశ్వరరావును అదుపులోకి తీసుకుని అతని నుంచి మూడు లీటర్ల సారా, గ్యాస్ పొయ్యి, సిలిండర్, డ్రమ్ములు స్వాధీనం చేసుకున్నారు. 600 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పి.వాసు తెలిపారు. నూజివీడు సీఐ రామకృష్ణ ఆధ్వర్యంలో మండల వ్యాప్తంగా సారా తయారీ, విక్రయాలు, రవాణాపై ప్రత్యేక నిఘా పెట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

ముసునూరు, ఆగస్టు 13: మండలంలోని బలివే తమ్మిలేరు నుంచి అక్రమంగా ఇసుకను రవాణా చేస్తున్న మూడు ట్రాక్టర్లను ఎస్‌ఐ పి.వాసు తన సిబ్బందితో కలిసి మంగళవారం దాడిచేసి పట్టుకున్నారు. బలివే గ్రామానికి చెందిన నాయుడు గంగాధర్, గుండుబోయిన నాగేంద్ర, పామార్తి రమేష్‌లు తమ ట్రాక్టర్లతో అనుమతులు లేకుండా తమ్మిలేరులో ఇసుకను లోడ్ చేసుకుని, నూజివీడు వైపు తరలిస్తుండగా గోపవరం వద్ద దాడిచేసి పట్టుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. ట్రాక్టర్లను సీజ్‌చేసి యాజమానులపై కేసులు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. మండలంలో ఉన్న తమ్మిలేరు నుండి ఇసుక రవాణాకు అనుమతులు లేవని, అక్రమంగా ఇసుక రవాణా చేస్తే చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ హెచ్చరించారు.

భార్యపై వేధింపులు.. ఆరుగురిపై కేసు నమోదు

ముసునూరు, ఆగస్టు 13: వివాహితను వేధింపులకు గురిచేస్తున్న ఆరుగురిపై ముసునూరు ఎస్‌ఐ పి.వాసు మంగళవారం కేసు నమోదు చేశారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని గుళ్ళపూడి చెందిన ముళ్ళపూడి జయరామ్ అదే గ్రామానికి చెందిన నాగదేవి 19 ఏళ్ళ క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. వీరికి ఒక కుమారుడు, కుమార్తె. జయరామ్ ట్రాన్స్‌కో లైన్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. అయితే కలిదిండి మండలంలో జయరామ్ పనిచేసిన సమయంలో మరో మహిళను ప్రేమ వివాహం చేసుకున్నాడు. ఈ నేపథ్యంలో మొదటి భార్య నాగదేవిని భర్త జయరామ్, అతని కుటుంబసభ్యులు ఐదుగురు చిత్రహింసలకు గురిచేస్తున్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఆరుగురుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ఎస్‌ఐ వాసు తెలిపారు.



చాట్రాయి సెంటర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న హిందూ సంఘాలు

బంగ్లాదేశ్‌లో.. హిందువులపై దాడులు అరికట్టాలి

చాట్రాయి, ఆగస్టు 13: బంగ్లాదేశ్‌లో హిందువులపై అల్లరి మూకలు దాడులకు పాల్పడటం అనాగరికమని హిందూ సంఘాలు ధ్వజమెత్తాయి. చాట్రాయిలో మంగళవారం రాత్రి సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి దాడులను తీవ్రంగా ఖండించారు. బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులను ప్రపంచ దేశాలు ఖండించాలని, భారత ప్రభుత్వం చొరవ తీసుకొని హిందువుల ప్రాణాలు, ఆస్తులకు రక్షణ కల్పించాలని ప్రదర్శకులు నినాదాలు చేశారు. గడ్డం సంజీవరెడ్డి, ఎస్. వేణు, చెన్నారెడ్డి, ముత్తారెడ్డి, ఆదిమూలం శర్మ, చెన్నారావు, దుర్గాప్రసాద్, ఇజ్జిగిరి నరసింహారావు, కేశవ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం: మంత్రి పార్థసారథి




ముదినేపల్లిలో ఎన్డీఏ కూటమి కార్యాలయం ప్రారంభిస్తున్న ఎంపీ పుట్టా మహేష్, ఎమ్మెల్యే కామినేని (ఇన్‌సెట్) ప్రసంగిస్తున్న మంత్రి పార్థసారథి

ముదినేపల్లి, ఆగస్టు 13 : రాష్ట్ర ప్రజల ఆకాంక్షలకనుగుణంగా కూటమి పాలన సాగుతోందని, రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తామని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. ముదినేపల్లిలో ఏర్పాటు చేసిన ఎన్డీఏ కూటమి కార్యాలయాన్ని మంగళవారం ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ యాదవ్, కైకలూరు ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన బహిరంగ సభలో మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఇరిగేషన్ ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు ప్రభుత్వం సమగ్ర ప్రణాళికలను రూపొందిస్తోందన్నారు. ఎంపీ మహేష్ యాదవ్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేసి ఆర్థిక పరిస్థితిని దిగజార్చిందని, దిగజారిన ఆర్థిక వ్యవస్థను మెరుగుపర్చేందుకు ఎన్డీఏ ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. రాష్ట్రంలో తొలిసారిగా ముదినేపల్లిలో ఎన్డీఏ కూటమి కార్యాలయాన్ని ప్రారంభించటం అభినందనీయమని అన్నారు. మాజీ మంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్, ఉమ్మడి కృష్ణా జిల్లా జనసేన అధ్యక్షుడు బండ్రెడ్డి రామకృష్ణ, ఏలూరు జిల్లా బీజేపీ అధ్యక్షుడు విక్రమ్ కిషోర్, టీడీపీ మండల అధ్యక్షుడు చల్లగుళ్ల శోభనాద్రి చౌదరి, నాయకులు పాల్గొన్నారు.

వైష్ణవికి సత్కారం

అమరావతి బ్రాండ్ అంబాసిడర్ అంబుల వైష్ణవిని గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి, ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ తదితరులు సత్కరించారు. మంగళవారం ముదినేపల్లిలో ఎన్డీఏ కార్యాలయ ప్రారంభం సందర్భంగా జరిగిన సభలో వైష్ణవిని సత్కరించి అభినందించారు.

ప్రతి ఇంటా మువ్వన్నెలు ఎగరాలి : కామినేని

కైకలూరు/మండవల్లి: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రతి ఇంటా జాతీయ జెండా ఎగరాలని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మంగళవారం వరహాపట్నంలో ఎమ్మెల్యే ఇంటి వద్ద కైకలూరు తపాలా శాఖ అధికారులు జాతీయ జెండాను ఎమ్మెల్యే చేతుల మీదుగా ఆవిష్కరింపజేసి ప్రధాని మోదీ పంపిన ఆహ్వాన పత్రికను, సావనీర్‌ను అందజేశారు. కైకలూరు సబ్ డివిజన్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ కె సురేష్‌కుమార్, మోహనవర్మ, తపాలా సిబ్బంది పాల్గొన్నారు. ప్రభుత్వ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలని అందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే కామినేని పేర్కొన్నారు. మండవల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం విద్యార్థులకు ఉచిత పాఠ్య పుస్తకాలు, ప్రభుత్వం అందిస్తున్న ప్రత్యేక కిట్లను అందజేశారు.

గ్రామాల్లో ఆరోగ్యకర వాతావరణం కల్పించాలి



వైద్య శిబిరంలో న్యాయాధికారి లక్ష్మికి బీపీ పరీక్షలు

ముదినేపల్లి, ఆగస్టు 13 : గ్రామస్థులకు ఆరోగ్యకర వాతావరణాన్ని కల్పించాల్సిన బాధ్యత అన్ని వ్యవస్థలపై ఉందని కైకలూరు సబ్ కోర్టు న్యాయాధికారి, మండల లీగల్ సెల్ కమిటీ చైర్మన్ వీవీఎస్ లక్ష్మి అన్నారు. పెయ్యేరు ఎస్టీ కాలనీలో మంగళవారం కైకలూరు తాలూకా లీగల్ సెల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు, ఆయుష్మాన్ భారత్ ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య శిబిరాన్ని ప్రారంభించిన న్యాయాధికారి లక్ష్మి మాట్లాడుతూ వాతావరణ కాలుష్యాన్ని అరికట్టడంతోపాటు పరిసరాల పరిశుభ్రతను పాటిస్తే ప్రజారోగ్యాన్ని కాపాడవచ్చునన్నారు. వ్యాధుల పట్ల వైద్య ఆరోగ్యశాఖ అప్రమత్తంగా ఉండాలన్నారు. పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎన్. శ్వేత పాల్గొన్నారు. చట్టాల పట్ల గ్రామీణులు అవగాహన పెంచుకోవాలని న్యాయాధికారి లక్ష్మి అన్నారు. అనంతరం జరిగిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆమె మాట్లాడుతూ చట్టాలపై అవగాహన పెంచుకుంటే సమాజంలో నేర ప్రవృత్తి తగ్గుతుందన్నారు. సదస్సులో ప్యానల్ అడ్వొకేట్ డి.శివప్రసాద్, న్యాయవాది ఎం.ఎస్.ఎస్.రాజు, హెడ్ కానిస్టేబుల్ ఎం.ఎస్.రావు, వీఆర్వో కేశవరావు తదితరులు పాల్గొన్నారు.



ఆ వ్యాపారుల నుంచి ధాన్యం సొమ్ము ఇప్పించాలి

నూజివీడు టౌన్, ఆగస్టు 13: ధాన్యం కొనుగోలు చేసి డబ్బులు చెల్లించకుండా తిరుగుతున్న ధాన్యం వ్యాపారుల నుంచి నగదు ఇప్పించాలని కోరుతూ ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో నూజివీడు ఆర్డీవో వై.భవాని శంకరికి రైతులు వినతిపత్రాన్ని అందించారు. అన్నవరానికి చెందిన ధాన్యం వ్యాపారులు చంద్రశేఖర్, సురేష్‌లు సుమారు కోటి రూపాయల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు చెప్పారు. సుంకొల్లు, దిగవల్లి, ముక్కొల్లుపాడు, అన్నవరం తదితర గ్రామాలకు చెందిన 116 మంది రైతులు ధాన్యం వ్యాపారుల బాధితులుగా ఉన్నారన్నారు. దీనిపై మే 25న నూజివీడు రూరల్ పీఎస్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారని, తక్షణం బకాయిలు చెల్లించేందుకు చర్యలు చేపట్టాలని వారు కోరారు. ఏపీ రైతు సంఘం నాయకుడు కొమ్మన నాగేశ్వరరావు, ఏఐటీయూసీ నూజివీడు నియోజకవర్గ కార్యదర్శి చాట్ల పుల్లారావు, మడుపల్లి నాగేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుడి వైద్యానికి ఆర్థిక సాయం

కైకలూరు, ఆగస్టు 13: తమ స్నేహితుడి ఆస్పత్రి ఖర్చులకు రూ.1,03,500లు ఆర్థిక సాయాన్ని పూర్వ విద్యార్థులు మంగళవారం అందజేశారు. కైకలూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1985-86 పదో తరగతి బ్యాచ్ విద్యార్థుల్లో ఒకరైన బందా రమేష్ మెదడు సంబంధిత వ్యాధితో హైదరాబాదులోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న పూర్వ విద్యార్థులంతా ఆర్థిక సాయాన్ని లక్కింశెట్టి మోహన్ ద్వారా అందజేశారు.

ఫిజియో థెరపీ వైద్య శిబిరం



ముసునూరు, ఆగస్టు 13:దివ్యాంగులకు ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ జి.ప్రశాంతి అన్నారు. రమణక్కపేట మెయిన్ పాఠశాలలోని భవిత సెంటర్ నందు మంగళవారం ఉచిత ఫిజియోథెరపీ క్యాంపును నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు పదిమంది పిల్లలకు ఫిజియోథెరపీ చికిత్సను అందించి వారిపట్ల తల్లిదండ్రులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రశాంతి వివరించారు. దివ్యాంగులకు ప్రభుత్వం ఉచిత పిజియోథెరపి క్యాంపులతో పాటు ఉపకరణాలను అందజేస్తోందని వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఐఆర్‌టీలు, డీఎంవీఎల్ నారాయణ, జె.నాగమల్లీశ్వరి, పాఠశాల హెచ్‌ఎం లోకరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాప్రతినిధుల చిత్రపటాల అందజేత



ముసునూరు, ఆగస్టు 13: మండలంలోని చెక్కపల్లి గ్రామసచివాలయంలో ఏర్పాటుచేసేందుకు టీడీపీ నాయకుడు కూచిపూడి దేవేంద్ర వితరణగా అందజేసిన ప్రజాప్రతినిధుల చిత్రపటాలను మంగళవారం ఎంపీడీవో కార్యాలయ పరిపాలన అధికారి కె.సాయిరామ్‌కు దాత, టీడీపీ నాయకులు సంయుక్తంగా అందజేశారు. నవ్యాంధ్ర ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు, ప్రధాని మోదీ, డిప్యూటీ సీఎం కొణిదల పవన్‌కల్యాణ్, నూజివీడు ఎమ్మెల్యే, రాష్ట్ర గృహనిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారథి చిత్రపటాలను టీడీపీ నాయకులు సాయిరామ్‌కు అందజేయగా, ఈ చిత్రపటాలను పంచాయతీ కార్యదర్శి ప్రసాద్‌కు ఇచ్చినట్లు సాయిరామ్ తెలిపారు. నాయకులు మాదల వెంకటేశ్వరరావు, కంచర్ల రాజారావు, కాటేపల్లి వెంకటశ్రీనివాసరావు, కొండేటి ఉదయ్‌కిరణ్(బాబి), గూడపాటి అజయ్ తదితరులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న అధికారులు


కలెక్టర్ ఆదేశాలతో.. చాట్రాయిలో అధికారుల పర్యటన

చాట్రాయి, ఆగస్టు 13: సీజనల్ వ్యాధుల నివారణకు ప్రభుత్వ చర్యలతో పాటు ప్రజా చైతన్యం కూడా అవసరమని జిల్లా ఇన్‌చార్జి వైద్య ఆరోగ్య శాఖాధికారి నాగేశ్వరరావు, గ్రామీణ నీటి సరఫరా విభాగం ఈఈ త్రినాథ్‌బాబు, నూజివీడు డీఎల్‌పీవో సుందరి అన్నారు. చాట్రాయిలో పారిశుధ్యం అధ్వానంగా ఉందని, తాగునీరు కలుషితమవుతున్నదని, జ్వరాలతో పలువురు చనిపోతున్నారని గ్రామస్థుల ఫిర్యాదుతో కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం అధికారులు గ్రామంలో పర్యటించారు. డ్రెయిన్లు పూడిక తీయించాలని, దోమల నివారణ మందు పిచికారీ చేయించాలని, అన్ని వీధుల్లో బ్లీచింగ్ చల్లించాలని, తాగునీరు కలుషితం కాకుండా పైప్‌లైన్‌లు మరమ్మత్తులు చేయించాలని, రక్షిత మంచినీటి సరఫరా ట్యాంకులు క్లోరినేషన్ చేయించాలని సర్పంచ్ ఉషా ప్రసాద్‌బాబు, పంచాయతీ కార్యదర్శి నాగరాజును ఆదేశించారు. ఈ సందర్భంగా స్థానిక సచివాలయంలో వారు విలేకరులతో మాట్లాడుతూ జ్వర లక్షణాలు కన్పిస్తే పీహెచ్‌సీకి వచ్చి వైద్యం చేయించుకోవాలని, కాచి చల్లార్చిన నీరు తాగాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దోమల కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, వేడి ఆహారం తినాలని ప్రజలకు సూచించారు. ఇక్కడి పరిస్థితులపై కలెక్టర్‌కి నివేదిక పంపుతామన్నారు. జిల్లా సర్వైలెన్స్ అధికారి నరేంద్రకృష్ణ, డీఈ భాస్కరరెడ్డి, ఎంపీడీవో మురళీమోహన్, పీహెచ్‌సీ వైద్యాధికారులు విజయలక్ష్మి, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ప్రతి ఇంటా జాతీయ జెండా ఎగరాలి

ముదినేపల్లి, ఆగస్టు 13 : స్వాతంత్ర్య వేడుకల సందర్భంగా ప్రధాని మోదీ పిలుపు మేరకు 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమాన్ని మంగళవారం పెయ్యేరులో బీజేపీ నాయకులు నిర్వహించారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోటప్రోలు కృష్ణారావు ఆధ్వర్యంలో పెయ్యేరు ఎస్టీ కాలనీ వాసులకు పార్టీ నాయకులు జాతీయ జెండాలను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అందజేసిన 5 వేల జాతీయ జెండాలను మండలంలో పంపిణీ చేస్తున్నట్లు కృష్ణారావు తెలిపారు. స్వాతంత్ర్య స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ తమ ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయాలని కోరారు. పార్టీ నాయకులు సత్యవోలు నాగలక్ష్మి, అడుసుమిల్లి సాయి కృష్ణ, మొవ్వ ఫణి, కొల్లిపర నాగరాజు, వీఆర్వో కేశవరావు తదితరులు పాల్గొన్నారు.



తామరకొల్లులో పొలంబడి నిర్వహిస్తున్న వ్యవసాయాధికారులు

మేలైన పద్ధతుల్లో సాగు చేయాలి

కైకలూరు, ఆగస్టు 13: మేలైన పద్ధతుల్లో వరి సాగు చేస్తే సత్ఫలితాలు అందుతాయని మండల వ్యవసాయాధికారి ఆర్. దివ్య అన్నారు. మంగళవారం తామరకొల్లులో రైతులకు పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. 30 మంది రైతులను ఎంపిక చేసుకొని వారికి ప్రతీ వారం పొలం పరిసరాల విశ్లేషణ, మిత్ర, శత్రు పురుగులపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. రసాయన ఎరువులు, పురుగుమందులు ఎంపిక విధానాన్ని రైతులకు వివరించారు.

కరుగోరుమిల్లిలో వెలి కేసుపై విచారణ

ఆచంట, ఆగస్టు 13 :ఆచంట మండలం కరుగోరుమిల్లికి చెందిన గూడూరి వరలక్ష్మి తనను గ్రామానికి చెందిన కొంతమంది కుల సంఘం నాయకులు వెలివేశారని గత నెల 15వ తేదీన జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసింది. కలెక్టర్ డీఎస్పీకి అప్ప గించడంతో డీఎస్పీ ఆదేశాల మేరకు గురువారం ఆచంట ఆర్‌ఐ జయలలిత స్థానిక వీఆర్‌వో చిట్టూరి శ్రీహరిలు గ్రామంలో విచారణ చేపట్టారు. వరలక్ష్మి గ్రామానికి చెందిన 12 మంది కుల సంఘం నేతలు తనను వెలి వేశారని చేసిన ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టినట్లు ఆర్‌ఐ తెలిపారు. ఇద్దరి నుంచి వివరాలు సేకరించి వీటిని ఉన్నతాధికారులకు పంపించామన్నారు. దీనిపై వరలక్ష్మి స్థానిక పోలీసు స్టేషన్‌లో కూడా ఫిర్యాదు చేసింది.



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్డీవో భవానీశంకరి

బాల్య వివాహాలు చేస్తే 1098కు కాల్ చేయండి

నూజివీడు టౌన్, ఆగస్టు 13: మిషన్ శక్తి కార్యక్రమంలో భాగంగా నూజివీడు బాలికోన్నత పాఠశాలలో బేటీ బచావో - బేటీ పడావో అంశంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. నూజివీడు ఆర్డీవో వై.భవానిశంకరి ముఖ్య అతిథిగా మాట్లాడుతూ బాలికలందరూ చదువులతో పాటు క్రీడల్లోను రాణించాలన్నారు. బాల్య వివాహాలు జరుగుతున్నట్లు తెలిస్తే 1098కు కాల్ చేయాలన్నారు. ఇన్‌చార్జి ఎంపీడీవో బేబీ, పాఠశాల హెచ్.ఎం వీణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె.ధనలక్ష్మి, డి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

భూములిచ్చిన రైతులకు న్యాయం చేయండి

ముసునూరు, ఆగస్టు 13: మండలంలోని బలివే గ్రామంలో జగనన్న కాలనీలు పేరిట ఇళ్ళస్థలాల నిమిత్తం పేద రైతుల నుంచి గత ప్రభుత్వం భూములు తీసుకుని, వారికి సెంటు భూమి కూడా ఇవ్వలేదని, తక్షణమే వారికి భూమి కేటాయించాలని, జనసేన నాయకులు మంగళవారం నూజివీడు ఆర్డీవో భవానిశంకరికి బాధిత రైతులతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ జనసేన నాయకుడు పాశం నాగబాబు మాట్లాడుతూ సమస్యను మంత్రి పార్థసారథి దృష్టికి తీసుకువెళ్ళామని, పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారని తెలిపారు. జనసేన నాయకులు తోట వెంకట్రావు, ఉమామహేశ్వరరావు, సూరిశెట్టి శివ, శ్రీకాంత్, ఏనుగుల చక్రి, చేబత్తిన విజయ్ తదితరులు పాల్గొన్నారు.



పెయిడ్ ఇంటర్న్‌షిప్‌కు ట్రిపుల్ ఐటీ విద్యార్థులు

నూజివీడుటౌన్, ఆగస్టు 13: ఆర్జీయుకేటీ నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్ ఈఈఈ విద్యార్థులు పెయిడ్ ఇంటర్న్‌షిప్ పొందినట్లు ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ఎన్.చంద్రశేఖర్ తెలిపారు. ఈఈఈ చివరి ఏడాదికి చెందిన 18 మంది విద్యార్థులు హైదరాబాద్‌కు చెందిన ప్రీమియర్ ఎనర్జీ ఫొటో ఓల్టాయిక్ ప్రై.లిమిటెడ్ కంపెనీలో నెలకు రూ.15 వేలు స్టైపెండ్‌తో ఆరు నెలల ఇంటర్న్‌షిప్‌కు ఎంపికయ్యారన్నారు. వీరితో పాటు బిడ్ అలెర్ట్ కంపెనీలో మరో 20 మంది విద్యార్థులు ఇంటర్న్‌షిప్‌కు ఎంపికైనట్లు తెలిపారు. విద్యార్థులను ట్రిపుల్ ఐటీ ఏవో పి.చంద్రశేఖర్, డీన్ ఆఫ్ అకడమిక్స్ రత్నాకర్ తదితరులు అభినందించారు.

ముసునూరు ఎంపీడీవో రాణి బాధ్యతల స్వీకారం

ముసునూరు, ఆగస్టు 13: ముసునూరు ఎంపీడీవోగా జి.రాణి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. సార్వత్రిక ఎన్నికల బదిలీల్లో భాగంగా భీమడోలు ఎంపీడీవోగా పనిచేస్తున్న సీహెచ్.పద్మావతిదేవి ముసునూరు ఎంపీడీవోగా వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న రాణి అమరావతి మండల ఎంపీడీవోగా వెళ్ళారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు సోమవారం పద్మావతిదేవి భీమడోలు ఎంపీడీవోగా బదిలీకాగా ఆమె స్థానంలో జి.రాణి ముసునూరు ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించారు. కార్యాలయ సిబ్బంది ఆమెకు అభినందనలు తెలిపారు.

ఆగిరిపల్లి ఎంపీడీవో శంకర్‌రావు బాధ్యతల స్వీకారం

ఆగిరిపల్లి, ఆగస్టు 13: ఆగిరిపల్లి ఎంపీడీవోగా పి.శంకర్‌రావు బాధ్యతలు స్వీకరించారు. గత ఎన్నికల ముందు ఆగిరిపల్లి ఎంపీడీవోగా పని చేసిన ఈయన పునఃనియమితులయ్యారు. ఎన్నికల ముందు ఆగిరిపల్లి ఎంపీడీవోగా పనిచేసిన పి.శామ్యూల్ తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు బదిలీ అయ్యారు.

పీహెచ్‌సీ సమస్యలు పరిష్కరిస్తాం

ముసునూరు, ఆగస్టు 13: ముసునూరు పీహెచ్‌సీలో సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్ళి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని, ముసునూరు సర్పంచ్ కొండేటి విజయ లక్ష్మి యిర్మియా అన్నారు. మంగళవారం పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ సమావేశంలో వైద్యాధికారిణి షకీనా ఇవాంజలి పీహెచ్‌సీలో సమస్యలను కమిటీకి వివరించారు. దీనిపై సర్పంచ్, ఎంపీపీ కొండా దుర్గాభవాని, జడ్పీటీసీ డాక్టర్ ప్రతాప్‌లు మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న బడ్జెట్‌లో పీహెచ్‌సీలో ఉన్న సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకోవడంతో పాటు సిబ్బంది సమస్యపై మంత్రి పార్థసారథి దృష్టికి తీసుకువెళతామన్నారు.

రైతుల విరాళాలతో రహదారులకు మరమ్మతులు



కలిదిండి, ఆగస్టు 13: యడవల్లి నుంచి పెద లంక వరకు గోతులు పడి అధ్వాన రహదారికి స్వచ్ఛందంగా మరమ్మతులు చేసేందుకు మంగళవారం మట్టగుంటలో రైతులు సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ పిలుపు మేరకు స్వచ్ఛందంగా ఆర్అండ్‌బీ రహదారి మరమ్మతులు చేసేందుకు ముందుకు వచ్చామన్నారు. రైతుల విరాళాలు రూ.4 లక్షలతో బుధవారం మరమ్మతులు చేపడతామన్నారు. సుమారు 6 కిలోమీటర్ల మేర రహదారిపై పడిన గోతులను కంకరతో పూడ్చి వాహనాల రాకపోకలు సాగించేలా చూస్తామ న్నారు. ఆక్వా రైతులు మద్దం భోగేశ్వరరావు, అంద్రాజు శ్రీనివాసరావు, దున్న భోగేశ్వరరావు, నాగిడి వీర బ్రహ్మం, తిరుమాని రంగారావు, దుగ్గిరాల ఆంజనేయులు, అక్కల బోసు, బొమ్మిడి ధనరాజ్, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ గ్రామ సభలిలా..

చాట్రాయి, ఆగస్టు 13: మండలంలో 16వ తేదీ నుంచి రెవెన్యూ గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ డి. ప్రశాంతి తెలిపారు. రైతులు తమ భూ సమస్యలు గ్రామ సభల ద్వారా పరిష్కరించుకోవటానికి ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశం వినియోగించుకోవాలని కోరారు. 16వ తేదీన చాట్రాయి, 17న జనార్దనవరం, 20న తుమ్మగూడెం, 22న చనుబండ, 24న పోలవరం, 27న పోతనపల్లి, 29న చిన్నంపేట, 31న చిత్తపూరు గ్రామాల్లో గ్రామ సభలు జరుగుతాయన్నారు. అలాగే సెప్టెంబరు 3న కోటపాడు, 5న సోమవరం, 10న మంకొల్లు, 12న ఆరుగొలనుపేట, 17న కొత్తగూడెం, 19న బూరుగ్గూడెం, 21న పర్వతాపురం, 24న కృష్ణారావుపాలెంలో గ్రామ సభలు జరుగుతాయని వివరించారు.

ముదినేపల్లి: మండలంలో రెవెన్యూ గ్రామసభల షెడ్యూల్‌ను తహసీల్దార్ సుబానీ వివరించారు. 16న పెదపాలపర్రు, 17న కోడూరు, 20న చిలపాలపర్రు, 21న ముదినేపల్లి, 22న దాకరం, 23న పేరూరు, 24న పెయ్యేరు, 27న చిగురుకోట, 28న చిన కామనపూడి, 29న పెద కామనపూడి, 30న వడాలి, 31న కోమర్రులో జరుగుతాయన్నారు. సెప్టెంబరు 2న కాకరవాడ, 3న దేవరం, 4న సింగరాయపాలెం, గోకినంపాడు, 5న చేవూరు, 6న గురజ, 9న పెనుమల్లి, 10న సంకర్షణపురం, 11న కొరగుంట పాలెం, 12న ఈడేపల్లి, 13న పెదగొన్నూరు, 16న ములకలపల్లి, 17న బొమ్మినంపాడు, 18న అల్లూరు, 19న వణుదుర్రు, 21న దేవపూడి, 24న ప్రొద్దువాక, 25న వాడవల్లి, 26న ఊటుకూరు, 27న వైవాక గ్రామాల్లో రెవెన్యూ గ్రామసభలు జరుగుతా యన్నారు. రైతులు తమ భూ సమస్యలు తెలియజేస్తే పరిష్కరిస్తామన్నారు.

బహిరంగ ప్రకటన

మా క్లయింట్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, విజయవాడ-3 బ్రాంచి వారి సూచనలు పొంది యుదుమూలముగా యావన్మందికి తెలియచేయునది ఏమనగా... (లేటు) వెంకట శివనాగబాబు గారి భార్య బొర్రా సోమశేఖర శివకుమారి గారి ఆస్తిని తనఖా పెట్టుకొని ఋణము పొందుటకు సంప్రదించినారు. కావున ఈ దిగువ షెడ్యూలు ఆస్తికి సంబంధించి ఎవరికైనా అభ్యంతరములు, క్లయిములు ఉన్నచో 7 రోజులలోపు తెలియ చేయవలయును. ఎట్టి అభ్యంతరములు, క్లయిములు రానిచో మా క్లయింట్ సదరు బొర్రా సోమశేఖర శివకుమారి గారికి ఋణం మంజూరు చేయును. **షెడ్యూలు :** కృష్ణాజిల్లా, కంకిపాడు సబ్ రిజిస్ట్రారు వారి యిలాకా, ఉంగుటూరు మండలం, నందమూరు గ్రామ పంచాయితీ ఏరియాలో చేరిన నందమూరు గ్రామం తాలూకా నేను స్వభావంలో వివరించిన విధముగా నాకు హక్కు కలిగి పీతు దఖలు పరచిన నందమూరు గ్రామ ఆర్.ఎస్.నెం. 91/16 దులో ఎ.0.02 1/2 లు లేక చ.గ. 121లు విశేష స్థలము సదరు స్థలములో గల ఆర్.సి.సి దాబా ఇంటి భాగమునకు హద్దులు. **తూర్పు :** పంచాయితీ రోడ్డు, **దక్షిణం :** జెల్లా బాబూరావు గారి ఆస్తి, **పడమర :** గ 3 లు వెడల్పు గల రోడ్డు, **ఉత్తరం :** ... వీరంకి ... గారి వద్ద క్రయంపొందిన ... తాలూకు ఆస్తి. ఈ హద్దుల మధ్య ఎ.0.021 1/2 లు లేక చ.గ.121 లు లేక చ.మీ. 101.16లు స్థిరాస్తి విశేష స్థలమున్నూ, సదరు స్థలములో డోర్ నెం. 1-169, అసెస్మెంటు నెం. 169 దు గల ఆర్.సి.సి దాబా ఇల్లు. ఈ ఆస్తికి సంబంధించిన DOC No: 3132/2021, SRO. కంకిపాడు,

టి.వి.ఎస్. వాసుదేవరావు, న్యాయవాది, గుడివాడవారివీధి, విజయవాడ. సెల్ నెం.98494 31432

ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్) కొరకు సంప్రదించాల్సిన నెంబర్లు
నూజివీడు : 99854 02464
కైకలూరు : 99854 09089

ఆంధ్రజ్యోతి దినపత్రిక కావల్సిన వారు ఈ క్రింది నెంబర్లను సంప్రదించగలరు
సర్క్యులేషన్ మేనేజర్ 9985411604,
డీజీఎం : 9885821929, బీఎం : 99854 11234